SRI GAYATRI AYURVEDIC MULTI SPECIALITY CENTRE
GIAYS
శ్రీ గాయత్రి ఆయుర్వేదిక్ మల్టీస్పెషాలిటీ సెంటర్

D.No. 58-15-124, Santhinagar, NAD 'x' Road, Visakhapatnam-530016. Ph : 9247011553
Email: srigayatriayurvedavskp@gmail.com

APTEL RNI NO: 62061/2015

# వార్తావళి

తెలుగు దినపత్రిక


వివాహ మరియు గృహ సంబంధమైన శుభ ముహూర్తములు మరియు పుట్టిన తేది, సమయం, పుట్టిన ప్రాంతం నక్షత్రములు బట్టి జాతకములు వ్రాయబడును
బులుసు వెంకట సుబ్రహ్మణ్యం
M.A. Astrology
#135/B,Sector-3, Ukkunagaram, Vizag-32
e*mail : bulusu333@gmail.com
Ph : 70320 34001, 85001 59006

విశాఖపట్నం : గురువారం 1 అక్టోబర్ 2020 | ఎడిటర్ : బులుసు వెంకట సుబ్రహ్మణ్యం | VAARTAVALI TELUGU DAILY | పేజీలు : 8 | రూ. 1.00 | సంపుటి 5 | సంచిక 219

## 1న గిట్టుబాటు ధరల ప్రకటన: సీఎం వైఎస్ జగన్



**అమరావతి, వార్తావళి, సెప్టెంబర్ 30:** రాష్ట్ర, జిల్లా, మండల స్థాయితో పాటు, చివరకు ఆర్బీకేల స్థాయిలో వ్యవసాయ సలహా కమిటీలు ఏర్పాటు కావాలి. అవి తరచూ సమావేశం కావాలి. ఏ పంట వేయాలి? ఏది వద్దు? అన్న దానిపై ఆ కమిటీలు రైతులకు అవగాహన కల్పించాలి. నిజానికి గత ఖరీఫ్‌లో వ్యవసాయ సలహా కమిటీలు చాలా బాగా పని చేశాయి. ఉదాహరణకు ప్రకాశం, కర్నూలు జిల్లాలలో పత్తి సాగును 5.75 లక్షల హెక్టార్లకు పరిమితం చేయగలిగాం. వరిలో వంగడాలు కూడా విజయవంతంగా మార్చగలిగాం. ఆ విధంగా చేయలేకపోతే, పంటల సాగుపై ప్రణాళిక లేకపోతే వాటికి ధర కల్పించలేం.ఏ పంటకు ఎంత కనీస గిట్టుబాటు ధర అనేది అక్టోబర్ 1వ తేదీన ప్రకటించ బోతున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెల్లడించారు. ఆ ధరలతో కూడిన పోస్టర్‌ను అక్టోబర్ 5వ తేదీ నాటికి అన్ని రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకేలు) వద్ద ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. ఆ ధరల కన్నా ఇంకా ఎక్కువే రైతులకు వచ్చేలా చూడాలని, అలా జరగకపోతే మార్కెట్ జోక్యంతో రైతులకు మేలు చేయాలని సూచించారు. సీఎం-యాప్ (సీఎం-ఏపీపీ) అమలయ్యేలా జేసీలు చూడాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో భాగంగా ధాన్యం సేకరణ సన్నద్ధతపై ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పలు ఆదేశాలు, సూచనలు చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

**ఈ-క్రాపింగ్ కీలకం**

గ్రామ సచివాలయాల్లోనే ఈ-క్రాపింగ్ జరగాలి. ఖరీఫ్ పంట చేతికి వస్తోంది. అంటే ధాన్యం సేకరణ ప్రక్రియ మొదలు కానుంది. ఈ ప్రక్రియలో ఆర్బీకేలు ప్రధాన పాత్ర పోషించాలి. ఈక్రాపింగ్ పక్కాగా పూర్తి కావాలి. ఎక్కడా అది పెండింగ్ ఉండకూడదు. కాబట్టి కలెక్టర్లతో పాటు, ఆర్బీకేల ఇన్‌చార్జ్‌లుగా ఉన్న జేసీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఈక్రాపింగ్ వివరాలను సచివాలయాల్లో ప్రదర్శించాలి. ఎక్కడైనా రైతులు మిస్ అయితే, వారి పేరు తప్పనిసరిగా నమోదు చేయాలి. ఇది చాలా ముఖ్యం.ఈక్రాపింగ్ ఉంటేనే, పంటల బీమా ప్రీమియమ్ చెల్లింపు, పంటల అమ్మకం, గిట్టుబాటు ధర కల్పన వంటివి సాధ్యం. అందువల్ల గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ) ప్రత్యేక శ్రద్ధ చూపి, ఈ ప్రక్రియ పూర్తి చేయాలి.

**ఆర్బీకేల వద్ద ఎంపీఎఫ్‌సీ**

ప్రతి ఆర్బీకే వద్ద మల్టీపర్పస్ సదుపాయాల కేంద్రం (ఎంపీఎఫ్‌సీ) ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. పంటల సాగుకు ముందు, ఆ తర్వాత రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడే విధంగా ఆ కేంద్రం పని చేస్తుంది. గోదాము, కోల్డ్ రూమ్, కస్టమ్ హైరింగ్ కేంద్రం, ప్రైమరీ ప్రాసెసింగ్ (గ్రేడింగ్ అండ్ సార్టింగ్), ధాన్యం సేకరణ, జనతా బజార్, బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్, ఆక్వాకు మౌలిక సదుపాయాల కల్పన, ఈమార్కెటింగ్ ప్లాట్‌ఫామ్ వంటి అన్నింటి కోసం ఆ కేంద్రాలు పని చేస్తాయి.ఆ కేంద్రాల కోసం ప్రతి ఆర్బీకే వద్ద భూమిని కలెక్టర్లు వచ్చే 15 రోజుల్లో సేకరించి, వ్యవసాయ శాఖకు అప్పగించాలి. సదుపాయాల కల్పన కోసం వచ్చే ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా రూ.6, 300 కోట్లు ఖర్చు చేయబోతున్నాం. ఆ ప్రక్రియలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (ప్యాక్స్) కూడా భాగస్వామ్యం వహిస్తాయి. కాబట్టి వచ్చే వారం రోజుల్లో అవి (ప్యాక్స్) తమ నివేదికలను ఆప్కాబ్‌కు అందజేయాలి.

## ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకి కరోనా పాజిటివ్



**న్యూఢిల్లీ:** ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు కరోనా బారిన పడ్డారు. ఆయనకు కరోనా లక్షణాలేవీ లేవని, ఆరోగ్యంగానే ఉన్నారని ఉపరాష్ట్రపతి కార్యాలయం ప్రకటించింది. ప్రస్తుతం ఆయన హోంక్వారంటైన్‌లో ఉన్నట్టు తెలిపింది. వెంకయ్యనాయుడి వయసు 71 ఏండ్లు. సాధారణ పరీక్షల్లో భాగంగా కరోనా టెస్టు చేయటంతో పాజిటివ్ అని తేలిందని ఉపరాష్ట్రపతి కార్యాలయం ట్వీట్ చేసింది. వెంకయ్యనాయుడు సతీమణి ఉషకు వైరస్ సోకలేదని, ఆమె స్వీయ ఏకాంతంలో ఉన్నారని పేర్కొంది. ఈ నెల 24తో ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు రాజ్యసభ చైర్మన్ హోదాలో వెంకయ్యనాయుడు హాజరయ్యారు. దాంతో సభలో ఉన్నవారిలో ఇంకెవరికైనా వైరస్ సోకిందేమోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## దశాబ్దాల పోరాటానికి సీఎం జగన్ పరిష్కారం చూపారు



**విజయవాడ, వార్తావళి, సెప్టెంబర్ 30:** దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా గిరిజనులకు సీఎం జగన్ భూమి హక్కు కల్పిస్తున్నారని డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి అన్నారు. ఈ మేరకు ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'అనేక దశాబ్దాల గిరిజనుల పోరాటానికి సీఎం జగన్ పరిష్కారం చూపారు. ఏ గిరిజనుడు, గిరిజన సంఘాలు పోరాటాలు చేయకుండానే సీఎం జగన్ ఈ హక్కులు కల్పిస్తున్నారు. లక్షా 10 వేల మందికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఇస్తున్నాం. సుమారు 2 లక్షల ఎకరాలు పంపిణీ చేస్తున్నాం. కమ్యూనిటీ పట్టాల ద్వారా 60 వేల మందికి పంపిణీ చేస్తున్నాం. లక్షా 60 వేల ఎకరాలు కమ్యూనిటీ పట్టాలిస్తున్నాం. భూములు లేని గిరిజనులకు కూడా ఒక్కొక్కరికి 2 ఎకరాలు పంపిణీ చేస్తున్నాం. అనేక దశాబ్దాలుగా గిరిజనులు సాగు చేస్తున్న భూమికి రెవిన్యూ పట్టాలు కూడా పంపిణీ చేస్తున్నాం. మొత్తం 3 లక్షల 50 వేల ఎకరాలకు గిరిజనులకు సాగు హక్కు కల్పిస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్దఎత్తున గిరిజనులకు భూ పంపిణీ చెయ్యలేదు. సీఎం జగన్ ఇచ్చిన మాట నిలబెట్టుకుని గిరిజన పక్ష పాతిగా నిలిచారు' అని డిప్యూటీ సీఎం పుష్ప శ్రీవాణి పేర్కొన్నారు.


## లోక్‌సభ స్పీకర్ నివాసంలో విషాదం



**న్యూఢిల్లీ:** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నివాసంలో విషాదం చోటుచేసుకుంది. ఆయన తండ్రి శ్రీకృష్ణ బిర్లా(92) కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. కోవిడ్ నిబంధనల నడుమ స్వస్థలం రాజస్తాన్‌లోని కిషోరాపూర్ ముక్తిధామంలో బుధవారం శ్రీకృష్ణ బిర్లా అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సమాచారం. కాగా పితృవియోగంతో విషాదంలో మునిగిపోయిన ఓం బిర్లా, ఆయన కుటుంబానికి సహచర ఎంపీలు, బీజేపీ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శీకృష్ణ బిర్లా మరణం పట్ల విచారం వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షుడు ముకుల్ రాయ్, ఎంపీ సుప్రియా సూలే తదితరులు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఇక ఓం బిర్లా రాజస్తాన్‌లోని కోటా నియోజకవర్గం నుంచి ఎంపీగా ప్రాతినిథ్యం వహిస్తున్న విషయం తెలిసిందే.

## 'చందమామ' తాతయ్య ఇకలేరు!

### శంకర్ కన్నుమూత



**చెన్నై:** 'చందమామ' పిల్లల పత్రిక ద్వారా నాలుగు తరాల భారతీయులను తన చిత్రాలతో ఆకట్టుకున్న శంకర్ (పూర్తిపేరు కేసీ శివశంకరన్) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యల కారణంతో చెన్నైలో మంగళవారం ఆయన తుది శ్వాస విడిచారు. ఆయన వయస్సు 96 ఏండ్లు. 1924లో చెన్నైలోని ఈరోడ్‌లో జన్మించిన శంకరన్.. 1946 నుంచి తుది శ్వాస విడిచే వరకూ బొమ్మలే ప్రాణంగా గడిపారు. 1946లో 'కళాయిమగల్' అనే తమిళ పత్రికలో పనిచేశారు. ఆ తర్వాత దిగ్గజ నిర్మాతలు నాగిరెడ్డి-చక్రపాణి ప్రారంభించిన 'చందమామ' కథల పత్రిక ఆయనకు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

## నవంబర్ 10 నుంచి తుంగభద్ర నది పుష్కరాలు



పవిత్ర తుంగభద్ర నదికి పుష్కరాలు శార్వరీ నామ సంవత్సరంలో జరగనున్నాయి. పన్నెండేళ్లకోసారి వచ్చే పుష్కరాలు నవంబర్ 10 నుంచి డిసెంబర్ 1 దాకా ఇవి జరగనున్నాయి. ఒక్కొక్క రాశిలో గురువు ప్రవేశించేటపుడు ప్రతి నదికి పుష్కరాలు జరుపుతారు. దేశంలో పుష్కరాలు జరిపే 12 నదులలో తుంగభద్ర ఒకటి. నవగ్రహాల్లో ఒకటైన గురు గ్రహం సంవత్సరానికి ఒకసారి చొప్పున 12 రాశుల్లో పరిభ్రమిస్తుంటుంది. బృహస్పతి మకరరాశిలో ప్రవేశించే సమయంలో తుంగభద్ర నదికి పుష్కరాలు జరుపుతారు. చివరిసారిగా 2008లో ఈ నదికి పుష్కరాలు జరిగాయి. ఈ పుష్కరాలు జరిగే 12 రోజుల్లో ముక్కోటి దేవతలు ఆ నదులలో కొలువై ఉంటారని ప్రతీతి. ఈ సమయంలో ఆ నదిలో స్నానమాచరించిన వారి పాపాలు తొలిగి.. పుణ్యం సిద్ధిస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. పశ్చిమ కనుమల నుంచి మొదలై.. కర్నాటక ఎగువ భాగాన ఉన్న పశ్చిమ కనుమలలో ఉద్భవించినవే తుంగ భద్ర. ఇది కర్నాటకలో కృష్ణా పరివాహక ప్రాంతం మీదుగా ప్రవహిస్తూ.. కర్నూలు జిల్లాలో గల కౌతాళం మండలం మేళగనూరు వద్ద ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశిస్తుంది. నదీ తీరంలో కొలువైన దేవాదిదేవతల పాదాలను అభిషేకిస్తూ.. సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. ఈ ఏడాది రెండు తెలుగు రాష్ట్రాలలోని నదుల్లో సమృద్ధిగా వర్షాలు కురవడంతో నదులు నిండుగా ప్రవహిస్తున్నాయి. తుంగభద్ర నది కూడా జలకళతో కళకళలాడుతున్నది. భక్తులు స్నానాలు చేయడానికి కర్నూలు జిల్లాలో గతంలో 17 ఘాట్లను ఏర్పాటు చేశారు. తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రం ఆలంపూర్‌లోనూ ఈ పుష్కరాలు జరుగుతాయి. కర్నూలులో.. మంత్రాలయం, సంగమేశ్వరం, కౌతాలం, గురజాల, పుల్లికల్, రాజోలి, నాగల దిన్నెలలో ఏర్పాట్లు చేయనున్నారు. ఈ పుష్కరాలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక నుంచే గాక తమిళనాడు నుంచి కూడా పెద్ద ఎత్తున ప్రజలు వస్తుంటారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్నాటకలోనూ ఈ పుష్కరాలను ఘనంగా జరుపుకుంటారు.

## సోనూసూద్‌కి ఐరాస అవార్డ్


### ఈ గౌరవం పొందిన తొలి భారతీయ నటుడు



**ఐక్యరాజ్యసమితి:** కరోనా సంక్షోభ కాలంలో బాలీవుడ్ నటుడు సోనూసూద్ దేశ ప్రజలకు చేస్తోన్న సామాజిక సేవను గుర్తించి, ఐక్యరాజ్య సమితికి చెందిన యునైటెడ్ నేషన్స్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (యూఎన్‌డీపీ).. ప్రతిష్టాత్మక ఎస్‌డీజీ స్పెషల్ హ్యూమానిటేరియన్ యాక్షన్ అవార్డుతో సత్కరించింది. సోమవారం ఆన్‌లైన్ ద్వారా సోనూసూద్‌కి ఈ అవార్డును ప్రదానం చేశారు. కరోనా సంక్షోభం సినీ పరిశ్రమలోని నిజమైన హీరోలను తెరపైకి తెచ్చింది. డాక్టర్లు, నర్సులు, వైద్య సిబ్బందితో పాటు బాలీవుడ్ నటుడు సోనూ సూద్ లాంటి మానవతా వాదులను సమాజానికి పరిచయం చేసింది. ఎన్నో సినిమాల్లో విలన్ పాత్రలతో సుపరిచితమైన సోనూసూద్ అనేక మంది వలస కార్మికులను తమ గమ్యస్థానాలకు చేర్చి, విదేశాల్లోని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా విమానాన్ని వేసి, కోవిడ్ సంక్షోభంతో ఆపదలో ఉన్న అనేక మందిని ఆదుకొని ప్రజల మనస్సుల్లో నిఖార్సయిన హీరోగా నిలిచిపోయారు. ఆయన చేసిన కృషిని సామాజిక మాధ్యమాల్లో ఎందరో అభినందించారు. సోనూసూద్ ఈ అవార్డు తనకు అత్యంత అరుదైన గౌరవమని, ఎంతో ప్రత్యేకమని, తన కృతజ్ఞతలను తెలిపారు. తనచుట్టూ కష్టాల్లో కొట్టుమిట్టాడుతోన్న ప్రజలకు నిస్వార్థంగా, తనకు తోచిన సాయం చేసినట్లు సోనూసూద్ అన్నారు.

## బాబ్రీ మసీదు కూల్చివేత కేసు తీర్పు వెల్లడి

దేశ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసి రెండు మతాల మధ్య విభేదాలను తీవ్రతరం చేసిన బాబ్రీ మసీదు విధ్వంసం కేసులో సీబీఐ ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు చెప్పింది. బాబ్రీ కూల్చివేత ఘటనలో బీజేపీ సీనియర్ నేత ఎల్కే అద్వానీ సంఘ్ నేతలు 32 మందిని కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. తాజా తీర్పు మహత్మపూర్వకమైన తీర్పు అన్న అద్వానీ... దీన్ని అందరం స్వాగతించాలి అన్నారు. ఇది సంతోషకర అంశం అన్నారు. బీజేపీ పార్టీ నిబద్ధతకు నిదర్శనంగా ఈ తీర్పును భావిస్తున్నాను. నా చిరకాల కోరిక అయోధ్య మందిరంపై సుప్రీంకోర్టు తీర్పు ఇటీవలే భూమి పూజ కూడా జరిగిన నేపథ్యంలో ఇంకా మహదానందంగా ఉంది. ఇక భవ్యరామ మందిర నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందాని నా దేశప్రజలతో కలిసి ఎదురుచూస్తున్నాను" అని అద్వాని తెలిపారు. బాబ్రీ మసీదు కూల్చివేత కేసులో అందరికంటే ఎక్కువ విమర్శలు ఎదుర్కొన్నది అద్వానీయే. ఈ కేసులో ఆరోపణల వల్ల అద్వానీ రాజకీయ జీవితంపై ప్రతికూల ప్రభావాలు పడ్డాయి. ఆయన లౌకిక వాదిగా వ్యవహరించట్లేదన్న విమర్శలు వచ్చాయి. ఈ కేసులో అద్వానీ నిర్దోషిగా ప్రకటించబడటంతో ఆయన నివాసానికి పలువురు కేంద్ర మంత్రులు బీజేపీ నాయకులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు.




## విలేకరులు కావలెను


'వార్తావళి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
చిత్తూరు, తిరుపతి, నగరి, మదనపల్లి, శ్రీకాళహస్తి
నియోజకవర్గాల ఇన్‌చార్జులుగా పనిచేయుటకు కమీషన్ పద్ధతిలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను. ఆసక్తి గల వారు ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
7032034001, 8500159006

## పాఠకులకు విజ్ఞప్తి

www.vaartavali.com వెబ్‌సైట్‌లో వార్తావళి దినపత్రిక ఇంటర్నెట్ పేపర్ వస్తుందని చెప్పడానికి వార్తావళి దినపత్రిక యాజమాన్యం తెలియపరుస్తున్నది. ఈ అవకాశాన్ని పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవల్సిందిగా కోరుతున్నాము.

# జాతీయం- అంతర్జాతీయం

## అమెరికా అధ్యక్ష అభ్యర్థుల తొలి ముఖాముఖి



**న్యూయార్క్:** అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, డెమొక్రాటిక్ అభ్యర్థి జో బైడెన్ మధ్య మొదటిసారిగా ముఖాముఖి చర్చ ప్రారంభమైంది. అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల మధ్య ప్రత్యక్ష చర్చ ఆనవాయితీగా వస్తున్నది. ఈనేపథ్యంలో వివిధ అంశాలపై ఇరువురు అభ్యర్థులు తమ వాదన వినిపిస్తున్నారు. ఈ చర్చ 90 నిమిషాలపాటు జరుగనుంది. ట్రంప్, బైడెన్ మధ్య అమెరికా అధ్యక్ష చర్చ సంధానకర్తగా క్రిస్ వాలెస్ వ్యవహరిస్తున్నారు. న్యాయ మూర్తుల ఎంపికలో ఇటీవల వచ్చిన ఆరోపణలు, విమర్శలపై క్రిస్ వాలెస్ మొదటి ప్రశ్న అడిగారు. కాగా, అమెరికాలో ఇప్పటికే ఎన్నికలు ప్రారంభమయ్యాయని, వేలాదిమంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారని జో బైడెన్ అన్నారు. ఒబామా కేర్‌ను రద్దు చేసి, ట్రంప్ తీసుకొచ్చిన కొత్త ఆరోగ్య బీమా పథకంపై ఇరువురు నేతలు తమ వాదన వినిపించారు. ఒబామా కేర్‌ను రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారని, వేలాదిమంది ప్రాణాలు కోల్పోయారని బైడెన్ విమర్శించారు. కరోనా వ్యాప్తిని నిలువరించడంతో ట్రంప్ విఫలమయ్యారన్నారు. కరోనా వ్యాక్సిన్‌పై ట్రంప్ మాటలు నమ్మేలా లేవని విమర్శించారు. వైద్య, ఆరోగ్య రంగంపై ట్రంప్‌కు ఎలాంటి ప్రణాళిక లేదన్నారు. కరోనా దృష్ట్యా పాఠశాలలు తెరవడం సరికాదన్నారు. ట్రంప్ హయాంలో అమెరికా ఆర్థికవ్యవస్థ పూర్తిగా దిగజారిందని చెప్పారు. అయితే అమెరికన్లకు మెరుగైన వైద్యం అందించాలన్నదే తన అభిమతం అని ట్రంప్ ప్రకటించారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో ఉన్నవారికి చికిత్స కోసం ప్రత్యేకంగా పథకం తీసుకొచ్చామని చెప్పారు. ఒబామా కేర్ పాలసీతో ఎవరికీ ఉపయోగం లేదని, అందుకే దాన్ని రద్దుచేశానని చెప్పారు.

## రెండు దఫాల్లో ఉపఎన్నికలు



**న్యూఢిల్లీ:** దేశంలోని 12 రాష్ట్రాల్లో 56 అసెంబ్లీ, ఒక లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 54 అసెంబ్లీ స్థానాల్లో నవంబర్ 3న, బీహార్‌లోని ఒక లోక్‌సభ స్థానంతో పాటు మణిపూర్‌లోని రెండు అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 7న పోలింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు మంగళవారం వెల్లడించారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు నవంబర్ 10న జరుగనున్నది. మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 28 స్థానాలకు ఉప ఎన్నికలు జరుగనున్నాయి. గుజరాత్‌లో 8 స్థానాలకు, యూపీలో 7 స్థానాలకు, ఒడిశా, నాగాలాండ్, మణిపూర్, కర్ణాటక, జార?ండ్‌లో రెండు చొప్పున స్థానాలు, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, హర్యానాలో ఒక్కో స్థానానికి చొప్పున ఎన్నికలు జరుగనున్నాయి. నాలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న ఏడు అసెంబ్లీ స్థానాలకు ప్రస్తుతం ఎన్నికలను నిర్వహించడంలేదని ఈసీ మరో ప్రకటనలో తెలిపింది. కేరళ, అసోం, తమిళనాడులో రెండు స్థానాల చొప్పున, పశ్చిమ బెంగాల్‌లో ఒక స్థానం ఖాళీగా ఉన్నది. ఈ రాష్ట్రాల శాసనసభ కాలపరిమితి వచ్చే ఏడాది మే, జూన్ నెలల్లో ముగియనున్నది. కరోనా సంక్షోభం, వివిధ రాష్ట్రాల్లో వరదల వంటి ప్రస్తుత పరిస్థితులను పరిగణలోకి తీసుకొనే ఉప ఎన్నికలు నిర్వహించకూడదని భావించినట్లు ఈసీ వర్గాలు తెలిపాయి.

## మనీశ్ సిసోడియాకు కరోనా నెగెటివ్



**ఢిల్లీ:** ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు మంగళవారం కరోనా నెగెటివ్‌గా నిర్ధారణ అయింది. చికిత్స అనంతరం ఆయన కోలుకోవడంతో మంగళవారం మధ్యాహ్నం వైద్యులు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. తనకు కరోనా వైరస్ సోకిందని, ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉన్నట్లు సెప్టెంబర్ 14న ఆయన ట్విటర్ వేదికగా వెల్లడించారు. కానీ, తరవాత శ్వాస సంబంధ సమస్యలు తలెత్తడంతో కుటుంబ సభ్యులు లోక్‌నాయక్ జయప్రకాశ్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ క్రమంలోనే డెంగీ కూడా సోకినట్లు ఆయన కార్యాలయ అధికారులు వెల్లడించారు. శరీరంలో రక్తకణాల సంఖ్య తగ్గిపోయినట్లు తెలిపారు. దాంతో వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించగా ప్రస్తుతం ఆయన కోలుకున్నారు. అయితే వారం రోజుల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఢిల్లీలో కరోనా వైరస్ కట్టడికి ఇతర మంత్రులతో పాటు మనీశ్ కూడా చురుగ్గా వ్యవహరించారు. ఇదిలా ఉండగా, ఇప్పటివరకు ఢిల్లీలో 2.7 లక్షల మందికి పైగా వైరస్ సోకగా, వారిలో సుమారు 5,200మంది ప్రాణాలు కోల్పోయారు.

## అమెరికాలో మొరాయిస్తున్న అత్యవసర నెంబర్లు


**వాషింగ్టన్:** అగ్రరాజ్యం అమెరికాలో అత్యవసర సహాయ నెంబర్ 911కు సంబంధించిన ఫోన్ లైన్లు పనిచేయక పోవటంతో గందరగోళం తలెత్తింది. ఈ నెంబరుకు ఫోన్ ద్వారా కాల్ చేయటం, సందేశాలు పంపడం సాధ్యం కావటం లేదని దేశం నలుమూలల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. దీనితో అత్యవసర సందర్భాల్లో తాత్కాలికంగా సంప్రదించేందుకు ఆయా రాష్ట్రాల పోలీసు శాఖలు ప్రత్యామ్నాయ నెంబర్లను ఏర్పాటు చేస్తున్నాయి. అయితే తర్వాత కొన్ని చోట్ల పరిస్థితిని పునరుద్ధరించినట్టు పోలీసు శాఖ ప్రకటించింది. సమస్య పూర్తిగా పరిష్కారం అయిన అనంతరం ప్రజలకు తెలియచేస్తామని అధికారులు సామాజిక మాధ్యమాల్లో తెలిపారు. కాగా నెవాడా, మినియాపోలిస్, సెయింట్ ఆంథొనీ, ఇల్లినాయిస్, నెవాడా, ఆరిజోనా తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి కొనసాగుతున్నట్టు తెలిసింది. ఈ పరిస్థితిపై అక్కడి పౌరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## 'ఆ ల్యాబ్‌ల నివేదికలతో దుబాయ్ రానివ్వం'




**ఢిల్లీ:** భారత్‌లోని నాలుగు ల్యాబ్‌లు ఇచ్చే కొవిడ్-19 నివేదికలను తిరస్కరిస్తున్నట్లు దుబాయ్ పౌర విమానయాన శాఖ (డీసీఏఏ) వెల్లడించింది. జైపూర్‌లోని సూర్యం ల్యాబ్, కేరళలోని మైక్రో హెల్త్ ల్యాబ్, ఢిల్లీలోని డాక్టర్ పి.భాసిన్ పాత్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్, నోబల్ డయాగ్నస్టిక్స్ సెంటర్ ఇచ్చే కరోనా నివేదికలను నిషేధిస్తున్నట్లు డీసీఏఏ పేర్కొంది. అంతేకాకుండా గత ఆగస్టు 28, సెప్టెంబర్ 4వ తేదీల్లో ఇద్దరు కొవిడ్ పాజిటివ్ ప్రయాణికులను తీసుకొచ్చినందుకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానాల సేవలను సెప్టెంబర్ 18 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు డీసీఏఏ సస్పెండ్ చేసింది. కరోనా నేపథ్యంలో మార్చి 23 నుంచి అంతర్జాతీయ విమాన సేవలను భారత ప్రభుత్వం నిషేధించిన విషయం తెలిసిందే. అయితే విదేశాలకు వెళ్లి వచ్చేందుకు కేంద్రమే ప్రత్యేకంగా వందే భారత్ మిషన్ తీసుకొచ్చింది. దాదాపు 10 దేశాలతో ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకుని విమాన సర్వీసులను నడుపుతోంది. యూఏఈ నిబంధనల ప్రకారం.. భారత్ నుంచి వచ్చేటప్పుడు ప్రయాణానికి 96 గంటల్లోపు ఆర్‌టీ-పీసీఆర్ పరీక్ష చేయించుకుని అసలైన కొవిడ్ నెగటివ్ ధ్రువపత్రాన్ని వెంట తీసుకురావాలి. అయితే భారత్‌లోని నాలుగు ల్యాబ్స్ అందించే కొవిడ్ పరీక్ష నివేదికలను డీసీఏఏ తిరస్కరణకు గురవుతాయని ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ట్వీట్ చేసింది. అయితే సెప్టెంబర్ 2న కొవిడ్ పాజిటివ్‌కు గురైన వ్యక్తి సెప్టెంబర్ 4న ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో దుబాయ్‌కు వచ్చాడు. ఇలానే అంతకుముందు మరొక ప్రయాణికుడు దుబాయ్ వెళ్లాడని, దీంతో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమాన సర్వీసులపై డీసీఏఏ సస్పెన్షన్ విధించినట్లు ఓ అధికారి తెలిపారు.

## పట్టణ మురికివాడల్లో వైరస్ వ్యాప్తి, రికవరీ అత్యధికం



**న్యూఢిల్లీ,** దేశంలో కరోనా వైరస్ విశ్వరూపం ప్రదర్శిస్తున్నది. అధికారికంగా 61లక్షల మందికే కొవిడ్-19 సోకిందని చెప్తున్నప్పటికీ ఏకంగా 12 కోట్ల మంది వ్యాధి బారినపడ్డారని ఐసీఎంఆర్ నిర్వహించిన రెండో సెరో సర్వేలో వెల్లడైంది. అయితే గ్రామాల్లో వైరస్ తగ్గుముఖం పట్టినట్లు సర్వేలో తేలింది. కరోనా వైరస్ సోకినవారి లో ఐజీజీ యాంటీబాడీలు భారీగా ఉత్పత్తి అవుతాయి. పౌరుల నుంచి సేకరించిన నమూనాల్లో ఈ యాంటీబాడీలు ఎంతమందిలో ఉన్నాయో తెలుసుకోవటమే సెరో సర్వే లక్ష్యం. ఆగస్టు 17-సెప్టెంబర్ 22 మధ్య నిర్వహించిన రెండో సెరో సర్వేలో దేశ జనాభాలో 18 ఏండ్ల పైబడినవారిలో 7.1% మందిలో యాంటీబాడీలు ఉన్నట్టు ఐసీఎంఆర్ ప్రకటించింది. ఈ రకంగా చూస్తే 12.5కోట్లమందికి కరోనా వచ్చి తగ్గిపోయినట్టు లెక్క. రెండో సెరో సర్వే వివరాలను కేంద్రం మంగళవారం వెల్లడించింది. మేతో పోల్చితే ఆగస్టు నాటికి కరోనా వ్యాప్తి శాతం తగ్గిందని పేర్కొంది.

**రెండో సెరో సర్వే వివరాలు**


దేశవ్యాప్తంగా 70 జిల్లాల్లో 700 గ్రామాలు, పట్టణాల్లో గత మేలో నిర్వహించిన మొదటి సెరో సర్వే మాదిరిగానే అవే ప్రదేశాల్లో ఆగస్టు, సెప్టెంబర్‌లో రెండో సెరో సర్వే నిర్వహించారు. మొదటి సర్వేలో 28,000 మంది నుంచి శాంపిల్స్ సేకరించగా రెండో సర్వేలో 29,082మంది నుంచి సేకరించారు. ఈ సర్వేలో 18 ఏండ్ల పైబడిన వారికి సంబంధించి 7.1శాతం మందిలో యాంటీబాడీలు కనిపించాయి.

## రైతులు నష్టపోయినా పట్టదా?



**డెహ్రాడూన్:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నూతన వ్యవసాయ బిల్లులను వ్యతిరేకిస్తున్న వారిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రైతులు నష్టపోయినా లెక్కలేదు.. కేవలం దళారులు లాభపడాలన్నదే ప్రతిపక్షాల ఉద్దేశమని మండిపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో పార్లమెంట్ భవనం సమీపంలోనే ట్రాక్టర్‌ను ప్రతిపక్ష కార్యకర్తలు దహనం చేయడం రైతన్నలను అవమానించడమేనని చెప్పారు. 'రైతుల స్వేచ్ఛను వారు (ప్రతిపక్షాలు) వ్యతిరే కిస్తున్నారు. రైతాంగం సమస్యలు ఎప్పటికీ కొనసాగాలని కోరుకుంటున్నారు. వ్యవసాయంలో ఉపయోగించే ట్రాక్టర్‌కు నిప్పు పెట్టడం ద్వారా మన రైతులను తీవ్రంగా అవమానించారు'అని దుయ్యబట్టారు. నమామీ గంగా మిషన్‌లో భాగంగా ఉత్తరా ఖండ్‌లోని హరిద్వార్, రిషికేశ్, ముని రేతి, బద్రీనాథ్‌లో రూ.500 కోట్లతో నిర్మించిన ఆరు మురుగునీటి శుద్ధి ప్లాంట్లను(ఎస్టీపీ) ప్రధాని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన..ప్రతిపక్షాలు ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. నాలుగు తరాలపాటు అధికారం అనుభవిస్తూ ప్రజలపై స్వారీ చేసిన ఓ పార్టీ(కాంగ్రెస్) అధికారంలో కోల్పోవడంతో నిరాశకు లోనవుతోందని, అందుకే ప్రతి అంశాన్ని వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుందని ప్రధాని ఆరోపించారు.

## భారత్‌లో ఆమ్నెస్టి కార్యకలాపాలు బంద్




**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టి ఇంటర్నేషనల్ భారత్‌లో తమ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్టుగా ప్రకటించింది. భారత ప్రభుత్వం తమను వెంటాడి వేధిస్తోందని తీవ్రమైన ఆరోపణలు చేసింది. బ్యాంకు ఖాతాలన్నీ ఫ్రీజ్ చేయడంతో సిబ్బందిని బలవంతంగా విధుల నుంచి తొలగించాల్సి వచ్చిందని మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే కేంద్ర ప్రభుత్వ వాదన మరోలా ఉంది. ఆమ్నెస్టికి విదేశీ నిధులు చట్ట విరుద్ధంగా వస్తున్నాయని, ఆ సంస్థ ఫారెన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సీఆర్ఏ) కింద రిజిస్టర్ చేసుకోలేదని చెబుతోంది. "ఆమ్నెస్టి ఇంటర్నేషనల్ ఇండియా బ్యాంకు ఖాతాలన్నీ స్తంభించి పోయాయి. సెప్టెంబర్ 10న నుంచి అన్ని అకౌంట్లు ఫ్రీజ్ చేశారు. దీంతో మా సంస్థ చేపట్టే పనులన్నీ ఆగిపోయాయి. సిబ్బందిని తొలగించాల్సి వచ్చింది."అని ఆమ్నెస్టీ సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. రెండేళ్లుగా కేంద్రం వేధింపులు కేంద్రం తమ సంస్థని రెండేళ్లుగా వేధిస్తోందని ఆమ్నెస్టి ఇంటర్నేషనల్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అవినాశ్ కుమార్ ఆరోపించారు. ఢిల్లీ ఘర్షణలు, ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్‌లో అల్లర్లలో మానవ హక్కులకు విఘాతంపై తమ సంస్థ ప్రశ్నలు సంధించిందని, ఫలితంగా బ్యాంకు అకౌంట్లు ఫ్రీజ్ జరిగిందన్నారు. ఆమ్నెస్టి ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థపై ఈడీ విచారణ చేయడం లేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఆ సంస్థకు అనుబంధంగా ఉన్న ప్రైవేటు కంపెనీ ఆమ్నెస్టి ఇంటర్నేషనల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ అండ్ ఇండియన్స్ ఫర్ ఆమ్నెస్టి ఇంటర్నేషనల్ ట్రస్ట్‌ని మనీ ల్యాండరింగ్, ఫారెన్ ఎక్స్‌ఛేంజ్ నిబంధనల ఉల్లంఘనల కింద విచారిస్తున్నట్టుగా తెలిపాయి. అనుమతుల్లేకుండానే అందుకున్న రూ.51 కోట్లపై విచారిస్తున్నట్టు తెలిపింది. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపణల్ని హోంశాఖ తిప్పికొట్టింది. ఆ ఆరోపణలు అవాస్తవం, అత్యంత దురదృష్టకరమని పేర్కొంది. భారత చట్టాలను ఉల్లంఘించి నిధులు తెచ్చుకుంటున్న ఆ సంస్థ తాము చేస్తున్న పనుల నుంచి దృష్టి మరల్చడానికే ఇలాంటి ఆరోపణలు చేస్తోందని పేర్కొంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల ద్వారా ఆమ్నెస్టీకి నిధులు అందుతున్నాయని, స్వచ్ఛంద సంస్థలకు అలా నిధులు రావడం చట్టవిరుద్ధమని స్పష్టం చేసింది. యూకే నుంచి 1.60 కోట్ల నిధుల కోసం 2011-12లో అప్పటి ప్రభుత్వం ఆమ్నెస్టీకి అనుమతులిచ్చిందని, 2013 నుంచే యూపీఏ హయాంలోనే అనుమతులు నిలిచి పోయాయని వెల్లడించింది.

## ఇవాంకకు అందం, తెలివి ఉందని..



**వాషింగ్టన్:** 2016లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్ష పదవికి తన కుమార్తె ఇవాంక ట్రంప్‌ను ఎంచుకోవాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భావించారట. అప్పట్లో ట్రంప్ ఎన్నికల ప్రచార వ్యవహారాలు చూసుకున్న రిక్ గేట్స్ నుంచి రాబోతున్న పుస్తకం 'విక్డ్ గేమ్'ను ఉటంకిస్తూ వాషింగ్టన్ పోస్టు ఈ వార్తను వెలువరించింది. ఈ పుస్తకం అక్టోబర్ 13న పబ్లిష్ కానుంది. 2016 ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష బరిలో ఉన్న ట్రంప్ తన సన్నిహితులతో మాట్లాడు తూ..'ఉపాధ్యక్ష స్థానానికి ఇవాంక అయితే ఎలా ఉంటుంది? ఆమె చలాకీగా, తెలివిగా, అందంగా ఉంటుంది. ప్రజలు ఆమెను ప్రేమిస్తారు!' అన్నట్టు వాషింగ్టన్ పోస్టు పేర్కొంది. అలాగే ఆయన ఆలోచనల్లో అప్పటి ఇండియానా గవర్నర్ మైక్ పెన్స్ కూడా ఉన్నట్లు తెలిపింది. అయితే తన ఎంపిక మంచి నిర్ణయం కాదని ఇవాంక తండ్రికి చెప్పినట్లు, దాంతో ఆ ఆలోచనను ఆయన విరమించుకున్నట్లు వెల్లడించింది. అయితే ఈ వార్తను ట్రంప్ అధికార ప్రతినిధి తోసిపుచ్చారు. దాంట్లో వాస్తవం లేదంటూ ఖండించారు. కాగా, ట్రంప్ అధ్యక్షుడిగా ఎన్నికైన తరవాత వైట్ హౌస్‌లో ఇవాంక తన తండ్రికి సీనియర్ సలహాదారులిగా నియమితులయ్యారు. ఆయన రెండోసారి అధికార పీఠాన్ని అధిష్టించేందుకు ఆమె తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు.

## ఎల్ఏసీపై చైనా వ్యాఖ్యల్ని తిప్పికొట్టిన భారత్!



**ఢిల్లీ:** భారత్, చైనా సరిహద్దులోని వాస్తవాధీనరేఖ(ఎల్ఏసీ)ను చైనా ఏకపక్షంగా నిర్వచించడాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. చైనా 1959లో ఏకపక్షంగా ప్రతిపాదించిన ఎల్ఏసీని తాము ఎప్పటికీ అంగీకరించమని భారత విదేశాంగ శాఖ పొరుగు దేశానికి గట్టిగా బదులిచ్చింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ప్రతినిధి అనురాగ్ శ్రీవాస్తవ మీడియాతో మాట్లాడారు. 'చైనా 1959లో ఎల్ఏసీపై ఏకపక్షంగా చేసిన ప్రతిపాదనలను భారత్ ఎప్పటికీ అంగీకరించదు. అప్పటి ఏకపక్ష ప్రతిపాదనలకు చైనా కట్టుబడి ఉన్నట్లు తాజాగా ఆ దేశ విదేశాంగ ప్రతినిధి పేర్కొనడం సరికాదు. ఆయన వ్యాఖ్యల్ని భారత్ తీవ్రంగా ఖండిస్తుంది. సరిహద్దు విషయాల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడాన్ని చైనా తగ్గించాలి. ఒకే ఎల్ఏసీ ఉందని చైనా పట్టుబట్టడం ఇరు దేశాల కట్టుబాట్లకు విరుద్ధం' అని శ్రీవాస్తవ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన భారత్, చైనా మధ్య 1993, 1996, 2005లో జరిగిన పలు ద్వైపాక్షిక ఒప్పందాలను గుర్తుచేశారు. ఇటీవల చైనా విదేశాంగ ప్రతినిధి ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఎల్ఏసీ విషయంలో చైనా 1959లో అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు చేసిన ప్రతిపాదనలకు కట్టుబడి ఉందని అన్నారు. కాగా వాస్తవాధీన రేఖ విషయంలో భారత్, చైనా మధ్య గత కొద్ది నెలలుగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే.

## డిస్నీలో 28 వేల ఉద్యోగాల కోత



**న్యూయార్క్:** పప్రపంచంలో ప్రముఖ వ్యాపార సంస్థ, థీమ్ పార్కులు, రిసార్ట్ వ్యాపారంలో అగ్రశ్రేణి కంపెనీ డిస్నీ తన ఉద్యోగాల్లో కోత విధిస్తున్నది. కరోనాతో వ్యాపారం పూర్తిగా తగ్గిపోవడంతో థీమ్ పార్కులు, రిసార్ట్‌ల్లోని 28 వేల మంది ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇందులో 67 శాతం మంది తాత్కాలిక ఉద్యోగులు ఉన్నారని డిస్నీ పార్క్స్ చైర్మెన్ జోష్ డీ అమారో తెలిపారు. డిస్నీ థీమ్ పార్కులు, రిసార్టుల విభాగంలో అమెరికా వ్యాప్తంగా సుమారు లక్షమంది ఉద్యోగులు ఉన్నారు. కరోనా వైరస్ డిస్నీ వ్యాపారాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిందని అమారో వెల్లడించారు. మహమ్మారివల్ల ఈ ఏడాది మొదటి మూడు నెలలు రిసార్టులు, థీమ్ పార్కులు మూతపడ్డాయని చెప్పారు. దీంతో 91 శాతం లాభాలు క్షీణించాయని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగాల్లో కోత విధిస్తున్నామన్నారు. మహమ్మారి ఎప్పుడు అంతమవుతుందన్న అంశంలో స్పష్టత లేదని, దీంతో భౌతిక దూరం నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉందని వెల్లడించారు. ఈకారణంగా తక్కువ సంఖ్యలో సిబ్బందితో వ్యాపారాలు కొనసాగించాల్సి వస్తున్నదని తెలిపారు. తమ వ్యాపార విజయంలో ఉద్యోగుల పాత్ర కీలకమైనదని చెప్పారు. వారి సహకారంతోనే వినియోగదారులకు ప్రపంచస్థాయి సౌకర్యాలు కల్పించామన్నారు.

# విజయనగరం- శ్రీకాకుళం- కాకినాడ



## కార్పొరేట్ల కోసమే వ్యవసాయ బిల్లులు

### వామపక్ష పార్టీల నేతలు విమర్శ



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** వ్యవాయరంగానికి నష్టం చేసి భూములును కార్పొరేట్ శక్తులు అప్పచెప్పి. రైతాంగాన్ని. ఆహార భద్రత కు హాని కలిగించే మోడీ ప్రభుత్వం తీసుకున్న మూడు వ్యవసాయ బిల్లులు నూవెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 29 న ఈ రోజు కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష లు చే పట్టారు ఈ దీక్షలు నుద్దేశించిసీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సబ్యులు రెడశంకరరావు.. సీపీఐ జిల్లా నాయకులు టీ. జీవా.. న్యుడేమో క్రసి నాయకులు మల్లిక్ మాట్లాడుతూ. పై విధంగా అన్నారు. ఈ దుర్మార్గమైన బిల్లు ను వై సి. పి... టీ. డి. పి లు బలపరచి రైతు ద్రోహులు గా నిరూపించారు అనివిమర్శించారు. ఇప్పటి కైనా ఆ పార్టీ నేతలు బీజేపీ వైఖరికి అనుగుణంగా అడుగులు వేయడం మానాలని విజ్ఞప్తి చేశారు.. ఇప్పటికే కేంద్ర మంత్రి రాజీనామా చేసినా. దేశ వ్యాప్తంగా రైతులు. ప్రజలు. పోరాడుతున్నా.. రాష్ట్రపతి ఆమోదం వేయడం.. చట్టం చేయడం. ప్రజాస్వామ్యం కూని చేయబడిందని అన్నారు. తక్షణమే స్వామి నాదన్ కమిటీ సిఫార్స్ లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వామపక్షాల పోరాటాన్ని ప్రజలంతా బలపర్చాలని కోరారు ఈ దీక్షలో సీపీఎం జిల్లా కమిటీ సబ్యులు ఏ. జగన్ మోహన్ .. కే.సురేష్.. పట్టణ సీపీఐ జిల్లా నాయకులు రంగ రాజు..న్యూ డెమోక్రసీ నాయకులు సింహాచలం తది తరులు పాల్గొన్నారు.

## ఉన్నతమైన సేవలందించి ఆదర్శవంతంగా నిలిచారు

### విజయనగరం జిల్లా ఎస్పీ బి. రాజకుమారి



**సాలూరు, వార్తావళి, సెప్టెంబర్ 30 :** సుదీర్ఘ కాలం పోలీసుశాఖలో ఎంతో క్రమ శిక్షణతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన మహిళా ఎస్ఐ కాకర గిరిజా కుమారి జిల్లా పోలీసుశాఖ తరుపున జిల్లా ఎస్పీ శ్రీమతి బి. రాజకుమారి, ఐపిఎస్.., జిల్లా పోలీసు కార్యాలయంలో తే. 30-09-2020 ది, బుధవారం నాడు ఘనంగా “ఆత్మీయ వీడ్కోలు” పలికారు. ఈ “ఆత్మీయ వీడ్కోలు” కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ – ఈ రోజు పదవీ విరమం పొందిన కాకర గిరిజా కుమారి 37సం.లు పోలీసుశాఖకు అవిశ్రాంతంగా సేవలందించారన్నారు. ఎక్కువ సర్వీసును విశాఖపట్నం సిటీలోనే పని చేసి, కానిస్టేబులు నుండి ఎస్ఐ స్థాయికి ఎదిగారన్నారు. విశాఖపట్నం సిటీలో శాంతి భద్రతలు, ట్రాఫిక్ మరియు ఇమ్మిగ్రేషను విభాగాల్లో ఎక్కువ కాలం పని చేసి, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని గిరిజాకుమారి సేవలను జిల్లా ఎస్పీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఎఆర్ డిఎస్పీ ఎల్. శేషాద్రి, ఎస్బీ సిఐ ఎన్. శ్రీనివాసరావు, జిల్లా పోలీసు అసోసియేషన్ అడహక్ కమిటీ సభ్యులు కె. శ్రీనివాసరావు, పోలీసు పిఆర్వో కోటేశ్వరరావు, ఇతర పోలీసు సిబ్బంది మరియు పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొని, ఉద్యోగ విరమణ చేసిన గిరిజాకుమారికి శుభాకాంక్షలు తెలిపారు.

## ధాన్యం సేకరణలో తేడా రాకూడదు



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** ధాన్యం సేకరణలో తేడా రాకూడదని జిల్లా కలెక్టర్ జె నివాస్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జిల్లా మిల్లర్లతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ధాన్యం సేకరణకు ముఖ్యమంత్రి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నా రని కలెక్టర్ అన్నారు. ధాన్యం సేకరణలో తేడాలు వచ్చినా, రైతులకు ఇబ్బందులు కలిగినా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. జిల్లాలో 27 శాతం మేర వర్షపాతం తక్కువగా ఉందని, దాదాపు 20 మండలాలలో కరువు ఛాయలు ఎక్కువగా ఉన్నాయని ఆయన అన్నారు. ఈ సమయంలో ఎటువంటి సమస్యలు ఉండరాదని పేర్కొన్నారు. మిల్లులు సార్టెక్స్ కు పెట్టుకోవాలని సూచించారు. బియ్యంలో నూకలు ఎక్కువగా ఉంటున్నాయని ఫిర్యాదులు రావడంతో 1075 రకం విత్తనాలు వేయలేదని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలు ద్వారా ధాన్యం సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా నిబంధనలు పాటించాలని ఆయన స్పష్టం చేసారు. జిల్లా మిల్లర్ల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు(వాసు) మాట్లాడుతూ గత ఏడాది 60 మిల్లులు సార్టెక్స్ మిల్లులుగా పెట్టుకున్నాయని, ఈ ఏడాది మొత్తం 125 మిల్లులు సార్టెక్స్ కు రానున్నాయని చెప్పారు. జిల్లాలో గిడ్డంగి సమస్య గత ఏడాది తలెత్తిందని, తద్వారా ఉత్పత్తికి తగిన విధంగా నిల్వ సామర్థ్యం ఉండాలని కోరారు. రుణ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేసారు. నాలుగు నెలలలో 3 లక్షల టన్నుల మేర సార్టెక్స్ బియ్యం అందించగలమన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఏ.కృష్ణా రావు, డి.ఎస్.ఓ వెంకట రమణ, వ్యవసాయ శాఖ డిడి రాబర్ట్ పాల్, మార్కెటింగ్ ఎడి బి.శ్రీనివాసరావు, మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ ఉద్యోగుల పట్ల తమ వైఖరి మార్చుకోవాలి

**తాళ్లపూడి, వార్తావళి, సెప్టెంబర్ 30 :** అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య మరియు ఏపిఎన్‌జిఓ సంఘం ఇచ్చిన పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవ హరిస్తున్న తీరుకు నిరసనగా 29.09.2020 మం గళవారం మధ్యాహ్నం 1 గంటలకు భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం తాళ్ళపూడి తహ సీల్దార్ కార్యాలయం నందు నిర్వహించ బడినది. తాళ్ళపూడిలో ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులందరూ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో గోపాలపురం తాలూకా ఎపియస్జీవో అసోసియేషన్ అధ్యక్షులు, మరియు సిపియస్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి జోడాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో పలు డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. కాంట్రాక్ట్ ఉద్యోగులందరినీ క్రమబద్ధీకరించడం, నియామకాలపై అన్ని నిషేధాలను ఉపసంహరించు కోవడం, చట్టబద్ధమైన నియామక సంస్థల ద్వారా అన్ని సాధారణ ఖాళీలను భర్తీ చేయడం, పిఎఫ్ ఆర్‌డిఎను స్క్రాప్ చేయడం మరియు ఎన్‌పిఎస్ కింద ఉన్న అన్ని చందాదారులను నిర్వచించిన ప్రయోజన పెన్షన్ పథకానికి నమోదు చేయడం, ప్రభుత్వ విభాగాలు మరియు ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపడం, ఉద్యోగుల ట్రేడ్ యూనియన్ ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షిం చడం, కార్మికులపై కార్మిక చట్ట సవరణలను రద్దు చేయడం, ప్రతి ఐదేళ్ళకు ఒకసారి ఆవర్తన వేతన సంఘాన్ని నియమించటం, వేతన సవరణ కోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తగిన నిధులను అందిం చడం, జీఎస్టీ బకాయిలను అత్యవసరంగా రాష్ట్రాల కు విడుదల చేయడం, ప్రభుత్వ ఉద్యోగుల బలవం తంగా అకాల పదవీ విరమణపై కేంద్ర ప్రభుత్వ సర్క్యులర్ ఉపసంహరించుకోవడం, అధిక ధరల పెరుగుదలను నివారించడం వంటి విషయాలపై కేంద్రం ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని నినాదా లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ క్రాంతి రేఖ, సీనియర్ సహాయకులు సత్యేంద్ర, జూనియర్ సహా యకులు ప్రభుకుమార్, మరియు వి.ఆర్.ఒలు, వి.ఆర్.ఎలు, కార్యాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

## కృష్ణప్రసాద్‌కు ఘననివాళి అర్పించిన బి.ఎస్‌పి

**అయినవిల్లి, వార్తావళి, సెప్టెంబర్ 30 :**

బి.ఎస్.పి.పార్టి జిల్లా అద్యక్షుడు సబ్బతి కృష్ణప్రసాద్ అకస్మిక మరణం అయినవిల్లి మండల దళితులు శ్రద్దాంజలి ఘటించారు అయన మరణం తీరని లోటు అని అయినవిల్లి మండల బిఎస్‌పి నాయు కులు మరియు దళిత సంఘనాయుకులు అవేదన వ్యక్తం చేసారు అయన మరణం పట్ల బిఎస్ పి పార్టి అద్వర్యంలొ అయన చిత్రపటనికి పులమలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు అనంతరం మగాపు ఈశ్వరరావు మాట్లడుతు బిఎస్ పి పార్టిలొ కిలక పదవలు చేసి పార్టి ప్రతిష్టకు కృషి చేసారు అని అన్నారు బి.జె.పి.ప్రదాన కార్యదర్శి ముత్తబత్తుల నీలకంఠం మాట్లడుతు సబ్బతి కృష్ణప్రసాద్ అంబే ద్కర్ బవాజలంతొ పనిచేస్తు నీలిజెండాను వాడ వాడలా తిసుకెల్లి బహుజనల రాజ్యధికారం కొసం అయన చేసిన కృషి మరువలేనిది అని అందరితొను స్నేహబావంగా ఉంటు మానుండి దూరం కావడం జీర్ణించుకొలేనిది అని అన్నారు అనంతరం అయనకు ఘననివాళి అర్పించారు ఈకార్యక్రమంలొ మగాపు ఈశ్వరరావు,ముత్తబత్తుల నీలకంఠం,గిడ్ల సురెష్, నక్కా సత్యనారాయణ, తదితరలు,పండు,బిర అన్నవరం, కొరపు జనర్దన్ శ్రద్దాంజలి ఘటించారు.

## ఎలుకలను సామూహికంగా నివారించండి

**కొత్తపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 30 :** చేలల్లో ఎలుకలను సామూహికంగా నివారించుకునిది గుబడులను సాధించాలని మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ విజ్ఞప్తి చేశా రు. రైతు భరోసా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సామూహిక ఎలుకల నివారణ క్రమంలో ఆయన సూచనలు చేశారు. వైసీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి దొరబాబు వ్యవసాయ శాఖ ద్వారా అందించే ఉచిత ఎలుకల మందును పంపిణీ చేశారు. సానా నాగు, గణేశుల నాగేశ్వ రరావు, రాపర్తి సూరిబాబు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, పోలినాటి జోయల్ పాల్గొన్నారు.

పిఠాపురం రూరల్: రైతులంతా ఒకే సమయంలో ఎలుకల నిర్మూలన చేపట్టడంవల్ల ప్రయోజనం ఉంటుందని మండల వ్యవసాయాధికారి అచ్యుత రామయ్య తెలిపారు. పిఠాపురం మండలంలోని 25 రైతుభరోసా కేంద్రాల్లో సోమవారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాలు చేపట్టారు. మందు ఎలా కలపాలి, వినియోగించాలో వివరించారు.

గండేపల్లి: మండలంలోని మల్లేపల్లి, తాళ్లూరు గ్రామాల్లో మండల వ్యవసాయశాఖ అధికారి కె.విశ్వ నాథ్ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. దీనికి ముఖ్య అతిథులుగా వ్యవసాయశాఖ అధికారి నాగకుమార్ హాజరయ్యారు.

పెద్దాపురం: రైతుల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రోత్సాహాన్ని అందిస్తోందని పెద్దాపురం వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు.

మండలంలోని కట్టమూరు రైతుభరోసా కేంద్రంవద్ద వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన సామూహిక ఎలుకల నివారణా మందు పంపిణీలో సోమవారం ఆయన మాట్లాడారు. సామూహిక ఎలుకల నివారణా మందు తయారుని రైతులకు వివరించారు. ఏవో ప్రశాంతి, పీఏసీఎస్ అధ్యక్షురాలు రంగనాథం రమాదేవి శ్రీనివాస్, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు చల్లా చినవీర్రాజు, జీను వెంకటరమణ, నల్లల గోవిందు, పెంట విజయ్‌కుమార్, పడాల చంటిబాబు పాల్గొన్నారు.

జగ్గంపేట రూరల్: మండలంలోని రైతుభరోసా కేంద్రాల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. రామవరం, జగ్గంపేట రైతుభరోసా కేంద్రాలవద్ద ఏర్పాటు చేసిన సదస్సులో జగ్గంపేట ఏడీఏ బండారు నాగకుమార్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల ఏవో రెడ్ల శ్రీరామ్, గ్రామ వీఐఏలు, రైతులు వలంటీర్లు పాల్గొన్నారు.

## పారిశుధ్యం, తాగునీరు పరిశుభ్రత కార్యక్రమాలపై సమీక్ష

**ఆత్రేయపురం వార్తావళి, సెప్టెంబర్ 30 :**/గ్రామాల్లో త్రాగునీరు, పారిశుధ్యం మరియు వీధి దీపాల నిర్వహణ పై పంచాయతీ కార్యద`ర్శులందరూ దృష్టి సారించాలని ఆత్రేయపురం ఎంపీడీఓ నాతి బుజ్జి కార్యదర్శులను ఆదేశించారు. అక్టోబర్ రెండో తేదీ నాటికి సచివాలయ వ్యవస్థ ఏర్పాటై సంవత్సరం పూర్తవుతున్నందున సచివాలయ సేవల విషయంలో సిబ్బంది మరింత జవాబుదారీ తనంతో పని చేసేలా పంచాయతీ కార్యదర్శులు సిబ్బందికి దిశా నిర్దేశం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో ఆ రోజు నుండి మనం మన పరిశు భ్రత కార్యక్రమాలు నిర్వహించేలా కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పంచాయతీ విస్తరణాదికారి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు శివ, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## త్వరితగతిన ఉద్యానపంటల లెక్కింపు: జిల్లా కలెక్టర్ జె.నివాస్



**శ్రీకాకుళం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** జిల్లాలో చేపడుతున్న కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రంకు సంబంధించిన ఉద్యాన పంటలు, ఇతర మొక్కలకు సంబంధించిన లెక్కింపును త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కొవ్వాడ ప్రోజెక్టుకు సంబంధించిన భూసేకరణ మరియు ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొవ్వాడ అణువిద్యుత్ కేంద్రం భూసేకరణకు సంబంధించిన భూములలోని ఉద్యాన పంటలకు సంబంధించి ఉద్యాన శాఖ మరియు ఇతర పంటలకు సంబంధించిన విలువలను అటవీశాఖ అధికారులు త్వరితగతిన లెక్కింపు చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గ్రామాల వారీగా ఎంత విస్తీర్ణంలో ఉద్యాన పంటలు ఉన్నాయో సవివరంగా ఉండాలని ఆయన స్పష్టం చేసారు. కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం అదనపు సి.ఇ బంగారు శెట్టి మాట్లాడుతూ టౌన్ షిప్ కోసం 350 ఎకరాలు, ఆర్ అండ్ ఆర్ కాలనీ నిర్మాణానికి 213 ఎకరాలు అవసరమని జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా అటవీ శాఖాధికారి సందీప్ కృపాకర్ గుండాల, జిల్లా రెవిన్యూ అధికారి బలివాడ దయానిధి, రెవిన్యూ డివిజనల్ అధికారి ఐ. కిషోర్, కొవ్వాడ యూనిట్ ప్రత్యేక ఉపకలెక్టర్ బి.శాంతి, సర్వే మరియు భూరికార్డుల శాఖ సహాయ సంచాలకులు కె.ప్రభాకర్, కొవ్వాడ అణు విద్యుత్ కేంద్రం కార్యనిర్వాహక ఇంజినీర్ దేవర, రణస్థలం తహాశీల్దార్ సుధారాణి పాల్గొన్నారు.

## ఎంఆర్ కాలేజీ ప్రైవేటీకరణ చేస్తే ప్రజా ఉద్యమం చేపడతాం

**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** ఎంతో పురాతన మైనబీ ఎంతో చరిత్ర కలిగినబీ ఎంతో మంది మహా మహుల్లు ని తయారు చేసిన ఎం. ఆర్ కళాశాల




ను ప్రైవేట్ కాలేజ్ గా మార్చాలని మాన్సా స్ యాజమాన్యం ప్రతి పాదన చేసింది. దీని పరిశీలన నిమిత్తం ఆర్. జే. డికి ప్రభుత్వ విద్యా శాఖ కమీసానార్ పంపించారు. దీన్ని తక్షణమే వెనుకకి తీసుకుని.. ప్రైవేటీకరణ విరమించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. లేదంటే ప్రజా ఉద్యమం చేపడతామని.. కచ్చితంగా అడ్డు కుంటామని అన్నారు. 1879 లో దక్షిణ భారత దేశంలో నే మొట్ట మొదటి గా ఏ ర్పడ్డకాలేజి. దీన్ని ప్రభుత్వపరం చేస్తామని ప్రస్తుత ప్రభుత్వం కమిషన్ వేశారు. కానీ నేడు ప్రైవేకరణ దిశగా అడుగులు వేయడం ప్రభుత్వం చూస్తూ వూరు కోవడం సరైనది కాదని శంకరరావు అన్నారు. చాసో నుండి బొత్స సత్యనారాయణ వరకు ఈ కాలేజీ లో చదువు కున్న వారేనని ఇంత ప్రాధాన్యత కలిగిన కాలేజీ నీ ప్రైవే టీ కరణ చేస్తే చూస్తూ ప్రజలు వూరు కొరని ఆయన హెచ్చరించారు..

## రక్తదానం చేసిన వ్యవసాయ విద్యాశాఖ ఉద్యోగులకు అభినందనలు

**కాకినాడ, వార్తావళి, సెప్టెంబర్ 30 :** వ్యవసాయ,పాఠశాల విద్యాశాఖలకు చెందిన ఉద్యోగులు 69 మంది రక్త దానం చేయడం అభినందనీయమని జేసీ జి.రాజకుమారి అన్నా రు. కోవిడ్ నేపథ్యంలో రక్తం కొరత లేకుండా చూసేందుకు వీలుగా రెడ్‌క్రాస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ (సంక్షేమం) జి.రాజకుమారి మంగళవారం రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభిం, చారు. స్థానిక రహదారులు, భవనాల శాఖ ఇన్ స్పెక్షన్ బంగ్లాలో జరి గిన ఈ కార్యక్రమంలో డొనేట్ బ్లడ్.. సేవ్ లైఫ్ అంటూ దాతలను ప్రోత్సహించారు. ఈ రక్తదాన శిబిరంలో వ్యవసాయ శాఖకు చెందిన 46 మంది,పాఠశాల విద్యా శాఖ లకు చెందిన 23 మంది రక్తదానం చేయడం అభినందనీయమని జేసీ తెలిపారు. అనంతరం జేసి రాజకుమారి, రెడ్‌క్రాస్ జిల్లా శాఖ చైర్మన్ వై.డి.రామారావు, వ్యవసాయ శాఖ జెడిఎస్‌విఎస్ ప్రసాద్, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ ఎస్ అబ్ర హం, ఎస్ఎస్ఎ.పిఓబి విజయ భాస్కర్‌లు రక్తదానం చేసిన ఉద్యో గులకు సర్టిఫికేట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ డీడీలు విటి. రామారావు,ఎస్ మాధవ్ రావు, ఏడిఏ పద్మశ్రీ, ఏవోలు,పాఠశాల విద్యా శాఖకు చెందిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయే తర సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## యస్.పి.అద్నాన్ నయిమ్ అస్మి, ఆడిషల్ యస్.పి అడ్మిన్,కె.కుమార్‌లకు ఘనస్వాగతం

**కాకినాడ, వార్తావళి, సెప్టెంబర్ 30 :** ఈ కరోనా సమయంలో సహా ఉద్యోగులకు ఎంతో ధైర్యం ఇచ్చి,అన్ని విధాలా ఆదుకుంటున్న యస్.పి,అడిషనల్ ఎస్పీ అడ్మిన్ లు,ఇటీవల అదే కోవిడ్ వైరస్ కు గురై చికిత్స పొంది, సంపూర్ణంగా కోలుకొని నెగిటివ్ రిపోర్ట్ వచ్చిన అనంతరం నిన్న జిల్లా పోలీస్ కార్యాలయం నందు విధులకు హాజరైన తూర్పు గోదావరి జిల్లా ఎస్ పి. శ్రీ అద్నాన్ నయిం అస్మి మరియు అడిషనల్ ఎస్.పి. అడ్మిన్ శ్రీ కె.కుమార్ గార్లకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ని అధికారులు మరియు సిబ్బంది అదే విధంగా జిల్లాలోని అధికారులు మరియు సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ స్వాగత కార్యక్రమానికి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్.పి. గరుడ్ సుమిత్, రంప చోడవరం ఏ.యస్ పి. జి.బిందు మాధవ్ ఎస్.బి.డి. యస్.పిలు శ్రీ ఎం.అంబికాప్రసాద్, యస్. మురళీ మోహన్, సిసిఎస్ డిఎస్పి శ్రీ వి. భీమారావు, పెద్దాపురం డి.ఎస్. ఏ. శ్రీనివాస రావు, అమలా పురం డి.ఎస్.పి శ్రీ షేక్ మాసుం భాష,ఏ.ఆర్. డి ఎస్పి శ్రీ ఎస్వి. అప్పారావు, జిల్లా పోలిసు కార్యాలయ సూపరింటెండెంట్‌లు మరియు కార్యాల య సిబ్బంది మరియు పోలీసు కార్యాలయ అన్ని విభాగాల పోలీసు అధికారులు సిబ్బంది,జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రెసిడెంట్ పి.సత్య మూర్తి మరియు ఇతరులు హాజరయ్యారు.

## దాతల సహకారంతో పిఠాపురం రోడ్డు గోతుల పూడిక

**సామర్లకోట, వార్తావళి, సెప్టెంబర్ 30 :** పిఠాపురం ప్రధాన రహదారిలో ఏలేరు వరద కారణంగా పూర్తిగా శిథిలమై భారీ గోతులతో అతి ప్రమాదకరంగా మారిన రహదారి గోతులను కొందరు దాతలు ముందుకు వచ్చి వాటిని పూడ్చే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు.పిఠాపురం రోడ్డులో రోడ్డుపై నుంచి వెళుతున్న నీటి ప్రవాహం మంగళవారం ఉదయానికి తగ్గిపోగా పెద్ద పెద్ద గోతులతో అతి ప్రమాదకరంగా ఉన్న రహదారిని చూసిన పిఠాపురం మండల కొండెవరం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ మేడిశెట్టి సుబ్రహ్మణ్యం,చిరు వ్యాపారి గొంతిన నాగేశ్వరరావు, పవర్ ప్లాంట్ ఇంజినీరు కొమ్మిరెడ్డి దుర్గబాబులు ముందుకు వచ్చి వారి ఉదారతను చాటుకున్నారు.

## మధ్యాహ్నం భోజన పథకం ఆన్లైన్ యాప్ పై శిక్షణ తరగతులు

**ఆత్రేయపురం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** మండలం పేరవరం రాష్ట్రప్రభుత్వం పాఠశాల విద్యా ర్థులకు అందచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం జగనన్న గోరుముద్ద పేరుతో అమలు చేస్తున్న సంగతి విదితమే పాఠశాలలో జగనన్న గోరుముద్ద అమలు తీరు పై నేడు పి.ఎమ్.సి కమిటీ ఛైర్మన్ లకు ప్రధానోపాధ్యాయులకు,వార్డు వెల్ఫేర్,ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, విలేజ్ ఆర్గనైజేషన్ (స్వయం సహాయక గ్రూపు సభ్యులు) అవగాహనా కార్యక్రమాన్ని మం డల విద్యాశాఖా ధికారి, పి.వి. ప్రసాదరావు ఏర్పాటు చేసారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ మోనటరింగ్ ఫర్ మిడ్-డే- మీల్స్‌తో పాటుగా సానిటేషన్ కూడా యూస్ చేయాలని యాప్ ద్వారా పాఠశాలల్లో జరుగు మధ్యాహ్నం భోజనం పథకం తీరును ఈ ఆన్లైన్ యాప్ ద్వారా ప్రతిరోజూ పర్యవేక్షించిన విషయాలను నమోదు చేయాలని కోరారు. జగనన్న గోరుముద్ద కార్యక్రమం పూర్తి పారదర్శకంగా అమలు అయ్యేందుకు వీలుగా ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఈ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.భోజన పథకం లో అందిస్తున్న అంశాలన్నీ జగనన్న గోరుముద్ద ఆండ్రాయిడ్ అప్లికేషన్ ద్వారా ఎప్పటి కప్పుడు నమోదు చేయడం వల్ల పథకం అమలు సజావుగా సాగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో పేరవరం ఉచ్చిలి కాంప్లెక్స్ పరిధిలో ప్రభుత్వ ప్రధానోపాద్యా యులు, బి.శ్రీనివాస్, కె.రాధారాణి, విషయ నిపుణు లు ఎస్.వి.వి.ఎన్.ఎస్ ప్రసాద్, వాసుకి, సురేష్ బాబు, రాంబాబు, సి.ఆర్.పిలు రాజేంద్ర, ఆత్మా రావు, సుధాకర్, జాన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గత ఐదేళ్లలో పెనుగుదురు సొసైటీ లాభాలు రూ 19.30 కోట్లు

**కరప, వార్తావళి, సెప్టెంబర్ 30 :** కరప మండలం పెనుగుదురు గ్రామం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు చీకల అప్పలరాజు ఆధ్వ ర్యంలో మహాజన సభ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఐదేళ్లలో రైతులకు సకాలంలో రుణాలు అందిస్తూ సొసైటీ రూ 19:30 కోట్లు లాభాలు ఆర్జించిందన్నారు.సీఈఓ టి.వీరభద్రరావు మాట్లాడుతూ 2020-21లోని ఆరు నెలల జమా ఖర్చులు చదివి వినిపించారు.పీఏసీఎస్ లకు నియమించిన త్రీమాన్ కమిటీ పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగించినందుకు రాష్ట్ర ప్రభు త్వానికి మరియు వ్యవసాయ సహకారశాఖ మంత్రి వర్యులు కురసాల కన్నబాబుకి పీఏసీఎస్ అధ్యక్షుడు అప్పలరాజు కృతజ్ఞతలు తెలిపారు.

# సంపాదకీయం



## వ్యవసాయ రంగ ప్రక్షాళన

వ్యవసాయ రంగ ప్రక్షాళన కోసమంటూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు బిల్లులకు లోక్‌సభ ఆమోదముద్ర పడ్డాక ఎన్‌డీఏ ప్రభుత్వంనుంచి బీజేపీ మిత్రపక్షమైన అకాలీదళ్‌కు చెందిన మంత్రి హర్‌సిమ్రత్ కౌర్ రాజీనామా చేశారు. తాము ఎన్‌డీఏ నుంచి కూడా తప్పుకునే అవకాశం వుందని ఆ పార్టీ చెబుతోంది. దేశంలో 'హరిత విప్లవానికి' దారి తీసిన నిర్ణయాల తర్వాత వ్యవసాయ రంగంలో భారీ సంస్కరణలు తీసుకురావడం ఇదే ప్రథమం. రైతు ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య(ప్రోత్సాహక, సులభతర) ఆర్డినెన్సు, రైతుల(సాధికార, పరిరక్షణ) ధరల హామీ, సాగు సేవల ఆర్డినెన్సు, నిత్యావ సర సరుకుల ఆర్డినెన్సుల స్థానంలో ఈ బిల్లులు తీసుకొచ్చారు. ఇందులో నిత్యావసర సరుకుల బిల్లును రెండురోజులక్రితం ఆమోదించారు. తమ ఉత్పత్తులను ఇష్టం వచ్చినచోట అమ్ముకోవడా నికి, అవసరమైతే వేరే రాష్ట్రాల్లో కూడా నచ్చిన ధరకు అమ్ముకోవడానికి అవకాశమిచ్చే ఈ సంస్క రణల వల్ల రైతులకు లాభమే తప్ప నష్టం వుండదన్నది కేంద్రం వాదన. ఇవి అమల్లోకొస్తే రైతులకు దళారుల బెడద తప్పుతుందని కూడా చెబుతోంది. వాస్తవానికి ఈ మూడు ఆర్డినెన్సులు వచ్చిన ప్పుడే రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ విషయంలో రైతుల అభిప్రాయాలు తెలుసుకుని, వారి సందేహాలను తీర్చేవిధంగా తగిన రక్షణలు పొందుపరిచాకే బిల్లులు తీసుకురావాలని, ఆర్డినెన్స్‌ల అమలు నిలిపేయాలని అకాలీదళ్ కోరినా కేంద్రం పట్టించుకోలేదు. సాగు రంగంలో సంస్కరణలు తీసుకురావాలని, రైతుల ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించే చర్యలు తీసుకోవాలని ఆ రంగంలో పనిచేస్తున్న సంస్థలు, సాగు రంగ నిపుణులు ఎప్పటినుంచో డిమాండు చేస్తున్నారు. రెండేళ్లక్రితం మహారాష్ట్ర మారుమూల ప్రాంతాల నుంచి సీపీఎం అనుబంధ సంస్థ అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో వేలాదిమంది రైతులు ముంబై మహానగరానికి తరలివచ్చిన దృశ్యాలు ఎవరూ మరిచిపోరు. తాము ఇప్పుడు తీసుకొచ్చిన సంస్కరణల పర్యవసానంగా రైతుల భవిష్యత్తు దివ్యంగా వుంటుందని ఎన్‌డీఏ ప్రభుత్వం చెబుతున్నప్పుడు వాస్తవానికి రైతుల నుంచి ఇంతగా ప్రతిఘటన రాకూడదు. ప్రస్తుతం జరుగుతున్న ఆందోళనలు ప్రధానంగా పంజాబ్, హర్యానాలకు పరిమితమైవుండొచ్చు గానీ...రైతు అనుకూల విధానాలు అవలంబిస్తున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల రైతుల్లోనూ ఇలాంటి భయాలున్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థలో సాగురంగానిది అత్యంత కీలక పాత్ర. కరోనా వైరస్ మహమ్మారి పంజా విసరడంతో దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్ కారణంగా ఈ ఏడాది తొలి త్రైమాసికంలో మన వృద్ధి రేటు మైనస్ 23.9 శాతానికి పడిపోయింది. నిరుడు ఇదే కాలానికి 5.2 శాతంగా వున్న జీడీపీ ఇంత దారుణంగా పడిపోయిన ఈ తరుణంలో కూడా సాగు రంగం 3.4 శాతం వృద్ధిని నమోదు చేసిందన్న వాస్తవాన్ని గమనిస్తే దేశ ఆర్థిక వ్యవస్థకు ఆ రంగం ఎంత దన్నుగా నిలబడిందో అర్థమవుతుంది. సాగురంగం ఈ స్థాయిలో వుండకపోతే మన జీడీపీ మరింత అధోగతి పాలయ్యేది. కానీ అందుకు ప్రతిఫలంగా ఈ దేశం రైతుకు ఏమిచ్చింది? అన్ని రంగాలూ పడకేసిన దశలో కూడా ఇంత మంచి పనితీరు కనబరిచినందువల్ల రైతుకు ఒరిగిందేమీ లేదు. వారి ఆదాయం రెట్టింపుకావడం సంగతలా వుంచి కొత్తగా అంతో ఇంతో పెరిగిందేమీ లేదు. గత రెండేళ్ల సంగతే తీసుకుంటే సాగు ఉత్పత్తుల ధరలు స్వల్పంగా పెరిగినా...అంతక్రితంతో పోలిస్తే పెరిగిన సాగు వ్యయానికి తగ్గట్టుగానైనా అవి లేవని నిపుణులు లెక్కలు చెబుతున్నారు. ఏతావాతా రైతుకు మిగిలేది ఎప్పుడూ అరకొరే. ప్రభు త్వాలు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)తో భారీయెత్తున సాగు ఉత్పత్తులు కొనుగోలు చేయడం, పల్లెసీమల్లో ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం వంటి చర్యలు నిరుపేదల్లో వినియోగాన్ని పెంచు తాయని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని వారి ప్రతిపాదన. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు ఆదర్శనీయంగా వుంది. సాగు సంస్కరణలే ధ్యేయంగా తీసుకొచ్చిన ఈ బిల్లులు చట్టాలైతే రైతులు తమ పంటల్ని దేశంలో ఏమూలనైనా అమ్ముకోవచ్చునని కేంద్రం చెబుతున్న మాటలు వినడానికి సొంపుగా వున్నాయి. కానీ మన రైతాంగంలో 86 శాతంమంది చిన్న రైతులు. వారిలో కూడా చాలామంది కౌలుదార్లు. సాగు వ్యయంతోనే నిండా మునిగివున్న రైతు వేల కిలోమీటర్ల దూరంలోని ఏదో రాష్ట్రంలో 'మంచి ధర' వస్తోందని విని తన ఉత్పత్తిని అక్కడికి తీసుకుపోగలడా? సాధ్యమేనా? చాలా సాగు ఉత్పత్తుల కదలికలకు ఇప్పుడు కూడా ఆంక్షలేమీ లేవు. అంతమాత్రాన రైతుకు ఒరిగిందేమిటి? ఇప్పుడున్న సాగు ఉత్పత్తుల మార్కెట్ కమిటీ(ఏపీఎంసీ)ల వ్యవస్థలోనే ఎన్నో లోపాలున్నాయని, వాటిని సవరించమంటే... అంతకన్నా అధ్వాన్నంగా వుండే విధానం అను సరించడం ఎంతవరకూ సబబని సాగు రంగ నిపుణుల ప్రశ్న. ఏపీఎంసీ వెలుపల అమ్ముకునే రైతులు మార్కెట్ సెస్, లెవీ చెల్లించనవసరం వుండదని బిల్లు చెబుతోంది. ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం పడిపోవడంతోపాటు సాగు ఉత్పత్తుల కొనుగోలు దారులనూ, కమిషన్ ఏజెంట్లనూ, ప్రైవేటు మార్కెట్లనూ నియంత్రించే వ్యవస్థ ఎగిరిపోతుంది. అంటే రాష్ట్రాల హక్కులకూ విఘాతం కలుగుతుంది. చివరకు ఈ రంగంలో మున్ముందు కార్పొరేట్ గుత్తాధిపత్యం వేళ్లూనుకుని శాసిస్తుంది. పర్యవసానంగా అసలు ఎంఎస్‌పీయే ఉండబోదన్న భయం సరేసరి. ఇలాంటి సందేహాలను నివృత్తి చేసేవిధంగా, రైతుల ప్రయోజనాల పరిరక్షించే నిబంధనలతో ఈ బిల్లులు రూపొందితే ఎవరికీ అభ్యంతరాలుండేవి కాదు. రైతు సంఘాల అభిప్రాయాలు తీసుకుని, పార్లమెంటులో విస్తృతంగా చర్చించాక బిల్లులు రూపొందిస్తే రైతుల్లో ఆందోళన వుండేది కాదు. కనీసం వీటిని సెలెక్ట్ కమిటీకైనా పంపి కూలంకషంగా చర్చించాల్సింది. రాజ్యసభలో ఇంకా ఈ బిల్లులు పెట్టాలి గనుక ఆ దిశగా కేంద్రం ఆలోచించాలి.

## అక్టోబర్ 1 సంఘసంస్కర్త రఘుపతి వెంకటరత్నంనాయుడు జయంతి

**ప్రపంచ వృద్ధుల దినోత్సవం, చైనా జాతీయదినోత్సవం, నైజీరియా జాతీయదినోత్సవం.**

**1847 : హోమ్‌రూల్ ఉద్యమకర్త అనీ బిసెంట్ జననం (మ.1933).(చిత్రంలో)**

**1862 : సంఘసంస్కర్త రఘుపతి వెంకటరత్నంనాయుడు జననం (మ.1939).**

**1869 : ప్రపంచములో తొలిసారిగా పోస్టుకార్డు ను ఆస్ట్రియా దేశంలో విడుదల చేశారు.**

**1922 : తెలుగు సినిమా హాస్యనటుడు అల్లు రామలింగయ్య జననం (మ.2004).**

**1928 : దక్షిణ భారత సినిమా నటుడు శివాజీ గణేశన్ జననం (మ.2001).**

**1935 : భారత సుప్రీంకోర్టు నెలకొల్పబడింది.**

**1946 : సినిమా దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం మరణం(జ.1902).**

**1951 : భారతదేశ లోక్‌సభ సభ్యుడు జి.ఎం.సి.బాలయోగి జననం (మ.2002).**

**1953 : కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ.**


**1958 : భారతదేశంలో "మెట్రిక్ కొలతల పద్ధతి" ప్రవేశపెట్టబడింది.**



రఘుపతి వెంకటరత్నం నాయుడు 1862, అక్టోబరు 1 న మచిలీపట్నంలో సుప్రసిద్ధ తెలగ నాయుళ్ళ ఇంట జన్మించాడు. తండ్రి అప్పయ్యనాయుడు సుబేదారుగా పనిచేస్తూ ఉత్తరభారతాన ఉండడంతో నాయుడు విద్యా భ్యాసం చాందా (చంద్రపూర్) నగరంలో మొదలయింది. హిందీ, ఉర్దూ, పర్షియన్ భాషలలో ప్రవేశం కలిగింది. తండ్రికి హైదరాబాదు బదిలీ కావడంతో, అక్కడి నిజాం ఉన్నత పాఠశాలలో చదువు కొనసాగించాడు. తరువాత మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో పట్టభద్రుడై, తరువాత ఎం.ఏ, ఎల్.టి కూడా పూర్తిచేసాడు. తల్లిగారైన శేషమ్మ విష్ణుభక్తురాలు. ఆమె సుగుణ సంపన్నురాలు. పవిత్రుడైన మానవుని కుల మతాల గురించి పట్టించుకోరాదు అనే వారామె. ఎం.ఏ. కాగానే మద్రాసు పచ్చయప్ప కళాశాలలో ఇంగ్లీషు ఆచార్యునిగా పనిచేసాడు. 1904లో కాకినాడ లోని పిఠాపురం రాజా కళాశాల (పి.ఆర్.కళాశాల) ప్రిన్సిపాలుగా ప్రమాణస్వీకారం చేసి సుదీర్ఘకాలం అదే పదవిలో కొనసాగాడు. 1911లో కళాశాలలో మొదటిసారిగా స్త్రీలను చేర్చుకుని సహవిద్యకు ఆద్యుడయ్యాడు. 1925లో మద్రాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడుగా నియమితుడయ్యాడు. ఆంధ్ర విశ్వకళా పరిషత్తు బిల్లును రూపొందించి శాసనసభలో ఆమోదిం పజేసాడు. 1924లో బ్రిటిష్ ప్రభుత్వాంచే నైట్ హుడ్ పుర స్కారాన్ని పొందాడు. 1927లో పరిషత్తు మొదటి స్నాత కోత్సవంలో నాయుడును గౌరవ డాక్టరేటుతో సత్కరించింది. ప్రసిద్ధికెక్కిన గురు-శిష్యుల జంటలు చెప్పేటప్పుడు రఘుపతి వెంకటరత్నం నాయుడు - వేమూరి రామకృష్ణారావు జంటని తప్పకుండా చెప్పు కుంటారు. 1884లో బి.ఏ చదువుతూ ఉండ గానే నాయుడుకు పెళ్ళయింది. 1889లో భార్య మరణించిన తరువాత మళ్ళీ పెళ్ళిచేసుకోకుండా, జీవితాంతం తెల్లటి దుస్తులే ధరించాడు. ఆయనను శ్వేతాంబర ఋషి అనేవారు. పేద విద్యార్థులను, అనాథలను చేరదీసి విద్యాబుద్ధులు చెప్పించేవాడు. తన నెలసరి ఆదాయంలో కొద్దిభాగం ఉంచుకుని మిగతాది బీద విద్యార్థులకే వినియోగించేవాడు. విజ్ఞానాభివృద్ధి కొరకు తన గురువైన డా.మిల్లర్ పేరిట మద్రాసు విశ్వవిద్యాలయంలో పదివేల రూపాయలతో ఒకనిధిని ఏర్పాటు చేసాడు. 1939 మే 26ఆధ్యాత్మిక జీవనానికి పునాదిన రఘుపతి వెంకటరత్నం నాయుడు మరణించాడు. ప్రముఖ సినిమా నిర్మాత, పంపిణీదారు, ప్రదర్శకుడు అయిన రఘుపతి వెంకయ్య, నాయుడు సోదరుడే. మహిళావిద్యా వ్యాప్తికై నాయుడు కృషిచేసాడు. పి.ఆర్ కళాశాలలో స్త్రీలకు ప్రవేశం కల్పించడమే కాక, వెనుకబడిన వర్గాల, బీద విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యం ఏర్పాటు చేసాడు. 'అపర సోక్రటీసు'గా ఆంధ్ర ప్రజల మన్ననలందుకున్న రఘుపతి వెంకట రత్నం నాయుడుగారు సంపూర్ణ జీవితం గడిపి 1939 మే 26వ తేదీన దివంగతులయ్యారు.

## ఆధ్యాత్మిక జీవనానికి పునాది

ఆరోగ్యం, సహజత్వం, సరళత్వం, కృతజ్ఞత, వినయం, ప్రేమ, వీరం, జ్ఞానం, సమర్థత, స్వతంత్రత, శాంతం, ఆనందం.. కలిసి పండించే శుభజీవన సంపదే శివం. దానిని పండించేదే విద్య. ఐహిక వికాసానికి, ఆధ్యాత్మిక పరిణతికి మార్గం వేసే మూలచైతన్య శక్తికూడా విద్యనే. సహజాతాల వికృత విజృంభణలను నియంత్రిస్తూ, సత్యశోధన వైపు వాటిని నిశిత పరుస్తూ, సమష్టి సమాజ సంక్షేమంపై ప్రసరింపజేసే సాంస్కృతిక మహోపకరణంగా విద్యను పేర్కొనాలి. అభ్యసన శీలం మనిషి నైజం. అది అతని మౌలికావసరం కూడా. జీవితం ఎప్పటికీ భద్రతతో వర్ధిల్లాలంటే మనిషి నిత్యవిద్యార్థిగా మసలుకోవలసి ఉంటుంది. విపరీతమైన వేగంతో, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో, విజ్ఞాన ఫలాలనూ, ప్రభుత్వాలనూ, శాసనాలనూ నియంత్రిస్తున్న ప్రపంచస్థాయి వ్యాపార ప్రాబల్యంతో మారిన వర్తమానంలో మనిషి తనను తాను నిత్యవిద్యార్థిగా సంసిద్ధుణ్ణి చేసుకోవడం అనివార్యం. ఒకప్పుడు సమాజ వ్యవస్థలో భాగమైన విద్య ఆధునిక కాలంలో ప్రభుత్వ వ్యవస్థలో భాగమైంది. ఫలితంగా విద్య అంశాలూ, ఆశయాలు, బోధనాక్రమం, ప్రయోజనాలూ అన్నిటినీ ప్రభుత్వాలే నిర్ణయిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో విద్య 'మౌలిక లౌకికవిద్య'గా రూపొందింది. ఫలితంగా 'ఆధ్యాత్మిక విద్య' ఆనుషంగికాంశంగా లేదా నిస్సంబంధ విషయంగా మారింది. ఆధ్యాత్మికత (శుభజీవన శివసంపద)ను మతానికి ముడి పెట్టడం వల్ల ఏర్పడిన అజ్ఞాన దుస్థితి ఇది. విద్య ఎవరి సారథ్యంలో సాగినా సంక్షేమం, అభ్యుదయం, భద్ర భవిష్యత్తు అన్నవి ముఖ్యం. ఇవన్నీ ప్రజల ప్రవర్తనలో సమాజం పట్ల, ప్రకృతి పట్ల ప్రకటితమయ్యే కృతజ్ఞత, వినయం, ఆదరణలపైనే ఆధారపడి ఉంటాయన్నది ప్రబల సత్యం. ఆయా స్థాయిలకు తగినట్లు విద్యాబోధన జరగాలె. విద్యా ప్రణాళికలలో భాగంగా వివిధ కార్యక్రమాలద్వారా విద్యార్థుల హృదయాల్లో



అందుకు తగిన బీజాలు పడేటట్లు చూడాలె. ఇది 'మతాతీతమైన సర్వజన సుఖకర సత్యం' అన్న అవగాహన విద్యార్థి దశలోనే స్పష్టంగా కలగాలి. అప్పుడే, అసలైన ఆధ్యాత్మిక జీవనానికి చక్కని పునాది పడుతుంది. మారుతున్న పరిస్థితుల్లో ఉద్యోగ జీవితంలో కూడా బలంగా నిలబడటానికి, ఉన్నతిని సాధించడానికి సంబంధిత విషయ పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను కాలానుగుణంగా నవీకరించుకోవలసిన అవసరం ఉంటుంది. వాటితోపాటు పెరిగే బాధ్యతలను, సవాళ్లను నిర్మాణాత్మకంగా ఎదుర్కొని, ఆరోగ్యకరంగా పరిష్కరించడానికి అందుకు తగినంతగా ఆధ్యాత్మిక బలాన్నికూడా పెంపొందించుకోవాలి. నవీన విద్యలో ఆధునిక శాస్త్రవిజ్ఞానంతో ప్రాచీన యోగ, వైద్య, గణిత, న్యాయ, నిర్మాణ, తత్త్వ, భాషాది శాస్త్రాలను తగిన ప్రయోగానుభవం ఆధారంగా అనుసంధానించగలగాలి. దీనివల్ల విద్యలో 'శుష్కలాభ దృష్టి' పోతుంది. ఆత్మీయతతో కూడిన బాధ్యతాయుత దృష్టి పరిఢవిల్లుతుంది. అప్పుడు సహజంగానే సమాజంలో తగిన ఆధ్యాత్మిక పరిణతి కలిగి, అంధ మత విశ్వాసం, విరోధం తొలగి దైవీయ మానవ మూల్యాలు బలపడుతై. ఇవి సమగ్ర శాంతిమయ పురోగతికి దారివేస్తాయి. అజ్ఞానం, పిడివాదాలకు తావులేని సత్యనిష్ఠతో బహుముఖీనమైన శాస్త్రవిజ్ఞానాన్ని సాంకేతికాభివృద్ధికే కాక తత్త్వసంస్కరణలకు, వ్యాప్తికి కూడా వాడుకోవలసిన అవసరం చాలా ఉంది. స్వచ్ఛ హృదయ విస్తృతిని పెంచే ఆధ్యాత్మిక మాధుర్యంతో శాస్త్రవిజ్ఞాన ఫలాల ఉత్పత్తినీ, వినియోగాన్నీ స్వచ్ఛందంగా నియంత్రించవలసి ఉంటుంది. అప్పుడు వివిధ సంకుచిత శృంఖలాలను విదిలించుకున్న, ఆత్మీయమైన వికాస సమాజం విశ్వగురువుగా విలసిల్లుతుంది. ఈ విధంగా మానవాళి చింతనలో శాస్త్రీయతను, చిత్తంలో ఆధ్యాత్మికతను సంపుష్టం చేసే నవ్య విద్యయే అఖండ జగద్రక్ష.

## అయోధ్యకు భరతుని రాక

(నిన్నటి తరువాయి)

"నాన్న నాకేమైనా చెప్పారమ్మా? నన్నడిగారా?" బోరుమన్నాడు భరతుడు."అమ్మా, నేనొచ్చినట్టు అన్నలు రామలక్ష్మణులకు చెప్పమ్మా. మంధర చేత వాళ్ళకి కబురు పెట్టు. ఇకపై నాకు తండ్రీ, గురువూ అన్నీ రామచంద్రుడే! ఆ శ్రీరాముని పాదాలే నాకు శిరోధార్యం" అన్నాడు భరతుడు. అమాయకుడా? అన్నట్టుగా చూసిందతన్ని కైక. జుత్తులోనికి వేళ్ళు జొనిపి, అతని తల నిమిరింది."నీ తండ్రి చివరి మాటలు చెబుతాను, నీకంతా అర్థమవుతుంది." అన్నది కైక."చెప్పమ్మా! నాన్న ఏఉవన్నారు? ఆయన ఆఖరి మాటలు ఏమిటి?" ఆత్రంగా అడిగాడు భరతుడు. "సీతారామలక్ష్మణులారా! మీరు పూజ్యులు. అఖండ యశస్సుతో అలరారే మీరు, అయోధ్యలో మళ్ళీ ప్రవేశించడం చూసిన వారే ధన్యులు. మిమ్మల్ని అప్పుడు చూడగలిగిన వారు దేవతలేగాని, మామూలు మనుషులు కాదంటూ నీ తండ్రి ప్రాణాలు విడిచాడు. ఇవే నీ తండ్రి ఆఖరి మాటలు." అన్నది కైక. సీతారామలక్ష్మణులు అయోధ్యలో మళ్ళీ ప్రవేశించడం ఏమిటి? వారిప్పుడు అయోధ్యలో లేరా? అయోధ్యను విడిచి ఎక్కడికి వెళ్ళారు? ఒకదాని తర్వాత ఒకటిగా ప్రశ్నలు మనసును దొలిచేస్తోంటే అయోమయంగా అడిగాడిలా భరతుడు."సీతారామలక్ష్మణులు ఎక్కడికి వెళ్ళారమ్మా? ఎందుకు వెళ్ళారు?" ప్రశ్నించాడు భరతుడు."చెప్పమ్మా? ఏంటిదంతా? నాకు కాళ్ళూ చేతులూ ఆడడం లేదు. చూపుకూడా ఆనడం లేదు" అన్నాడు. భరతుని ముఖాన్ని చేతుల్లోకి తీసుకున్నది కైక. అతని బుగ్గల మీద మెత్తగా చరిచింది."ఇప్పుడు ఎలా ఉంది బాబూ? చూపు ఆను తోందా?" అడిగింది. ఆనుతోందన్నట్టుగా రెప్పలల్లార్చాడు భరతుడు. తేరిపార తల్లిని చూశాడు."చెప్పమ్మా? ఏం జరిగింది?"ఇక చెప్పక తప్పదు. చేసిన ఘనకార్యాన్ని వల్లించక తప్పదనుకున్నది కైక. చెప్పిందిలా."అప్పుడెప్పుడో మహారాజు నాకిచ్చిన రెండు వరాలను ఇప్పుడు నేను చెల్లించమన్నాను. యౌవరాజ్య పట్టాభిషేకం రాముడికి చేస్తోంటే రాముడుకి కాదు, నీకు చెయ్యమన్నాను. అదొక వరం. మరొక వరం ప్రకారం, నారచీరలు ధరించి, రాముణ్ణి అరణ్య వాసం చెయ్యమన్నాను. దండకలో పద్నాలుగేళ్ళు ఉండమన్నాను. "ఆశ్చర్యంగా చూశాడు భరతుడు.



వెనుకడుగు వేసి, తల్లికి దూరంగా జరిగాడు."తండ్రి ఆజ్ఞానుసారమే రాముడు అడవులకు వెళ్ళాడు. అతనితో పాటుగా సీత, లక్ష్మణులు కూడా వెళ్ళారు. వారిని వెళ్ళమని నేనడగలేదు, వారంతట వారుగానే వెళ్ళారు" అన్నది కైక.మరో వెనుకడుగు వేశాడు భరతుడు. తల్లికి మరింత దూరం అయ్యాడతను."నా వరాలు నేను అడిగాను, వాటిని చెల్లించి, రాముడికి నీ తండ్రి దూరమయ్యాడు. ఆ బాధ భరించలేక, అతన్నే పలవిస్తూ ప్రాణాలు విడిచాడు." అన్నది కైక.మరో అడుగు వెనక్కి వేశాడు భరతుడు. తల్లికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్నట్టుగా వెనక్కి నడుస్తున్నాడతను."నీ తండ్రి అంత్యక్రియలు నువ్వే చెయ్యాల్సి ఉంది. అందుకే వసిష్ఠులు వారు నిన్ను ఇక్కడికి వెంటనే రప్పించారు. నాన్నగారి ఉత్తరక్రియల అనంతరం, ఈ రాజ్యం నీదే! మంత్రి సామంతులు నిన్ను రాజ్యాభిషిక్తుణ్ణి చేస్తారు." అన్నది కైక.భరతుడు వెనుకడుగు వేసి వెళ్ళేందుకు గోడ అడ్డగించడంతో తూలిపడబోయాడు. నిలదొక్కుకున్నాడు."నాయనా! జరిగిందేదో జరిగిపోయింది. మహారాజు మరణించాడు, సీతారామలక్ష్మణులు అడవులకు వెళ్ళిపోయారు. వారిని గురించి ఇక ఆలోచించడం అనవసరం. నీ గురించి నువ్వు ఆలోచించుకో!రాజువికా! కోశాగారాలు స్వాధీనం చేసుకో! ఈ మహా సామ్రాజ్యాన్ని పాలించి, నిన్ను మించిన వాడు లేడని పేరు తెచ్చుకో! ఈ తల్లి కోరిక తీర్చు" అన్నది కైక. దగ్గరకు రాబోయింది."నీచురాలా! ఆగక్కడ, దగ్గరకు రాకు." అరి చాడు భరతుడు. అతని అరుపునకు అంతఃపురం అదిరిపోయింది. రెపరెపలాడి మందిరంలోని దీపాలు ఆరిపోయాయి. పట్టపగలు అక్కడ చీకటి అలముకుంది.

(మిగతా రేపటి సంచికలో)

## మెదడులో కణితి.. పోయేదెలా?



ఒకప్పుడు మెదడు కణితులకు చికిత్స కష్టమే గానీ, ఇప్పుడు అంతగా భయపడాల్సిన పని లేదు. సాధారణ కణితి సర్జరీతో తొలగిపోతుంది. కానీ క్యాన్సర్ కణితులను తొలగించిన తర్వాత కీమోథెరపీ, రేడియేషన్ అవసరం అవుతాయి. ఇతర క్యాన్సర్లు మొదటి దశ తర్వాత క్రమేపీ ముదిరి నాలుగో దశకు చేరుతాయి. కాబట్టి, వీటిని ముందుగా గుర్తిస్తే దాదాపుగా నయం చేయవచ్చు. కానీ మెదడులో కణితులు మొదలవడమే మూడు లేదా నాలుగో దశలో ఉండవచ్చు. కణితి చాలా చిన్నగా ఉండి, ఎంఆర్ఐ స్కానింగ్‌లో మొదటి రెండు గ్రేడుల్లో ఉంటే వెంటనే సర్జరీ చేయాల్సిన పనిలేదు. అది 2 నుంచి 3 సెం.మీ వరకు పెరిగాక సర్జరీ అవసరం. మెదడు నుదురు, చెవుల భాగాల్లో వచ్చే కణితులను తొలగిస్తే చాలావరకు సాధారణ జీవితం గడపవచ్చు. కానీ, మధ్య భాగంలో కణితులను తొలగించడం కూడా కష్టమవు తుంది. ఎందుకంటే కీలక భాగాల కణజాలాన్నీ, కణితినీ వేరుచేసి చూడటం కష్టం. పొరపాటున మెదడు భాగాన్ని కూడా తొలగిస్తే నష్టం. ఈ తేడాను గుర్తించడానికి మైక్రోస్కోప్, నేవిగేషన్ వంటి పరికరాలను వినియోగిస్తున్నాం. మీరు ఆందోళన చెందకుండా, మీ అమ్మను మరింత ఆందోళన పెట్టకుండా దగ్గర్లోని న్యూరోసర్జన్‌ని కలవండి.

## బట్టతల ఉన్నవాళ్లు మందులు వాడితే ఇక అంతే!



అత్యాశకు పోతే ఉన్నది కూడా ఊడి చేతిలోకి వస్తుంది. బట్టతల వచ్చిందని ట్రీట్‌మెంట్ తీసుకుంటే అనుకోని ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ముఖ్యంగా మహిళలకు బట్టతల సమస్య అంతగా బాధపెట్టదు. ఈ సమస్య పురుషుల్లోనే ఎక్కువగా ఉంటుంది. ఒత్తైన జుట్టు కోసం పురుషులు వాడే మందులు వారి లైంగిక జీవితాన్ని నాశనం చేస్తున్నాయట. ఈ విషయం ఓ అధ్యయనంలో బయట పడింది. దీని గురించి తమ వద్దకు వచ్చే పేషెంట్లకు డాక్టర్లు చెబుతున్నప్పటికీ ట్రీట్‌మెంట్ ప్రారంభించండి అంటున్నారు. వీరు వాడే మందులలో ఫినాస్టెరాయిడ్, డూటా స్టెరాయిడ్‌లు ఉంటాయని చెబుతున్నారు. వీటి కారణంగానే లైంగిక సామర్థ్యం తగ్గిపోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీని ప్రభావం కొందరిలో తాత్కాలికంగా కనిపిస్తుంది. మరికొందరిలో ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

## ఇమ్యూనిటీ ఫుడ్ జొన్న దోశ





కావాల్సిన పదార్థాలు జొన్నలు: రెండున్నర కప్పులు, బియ్యం: అర కప్పు, మినపప్పు: కప్పు, నువ్వుల నూనె: పావు కప్పు ఉప్పు: తగినంత తయారు చేసే విధానం: పదార్థాలన్నిటినీ రాత్రిపూట విడివిడిగా నానబెట్టుకోవాలి. ముందు మినపప్పును మెత్తగా రుబ్బుకొని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. తరువాత జొన్నలు, బియ్యాన్ని రుబ్బి మినప్పిండిలో వేసుకోవాలి. ఈ పిండి మరీ గరిటె జారుడుగా లేకుండా చూసుకోవాలి. తగినంత ఉప్పు కలిపి పులవనివ్వాలి. దోశ వేయడానికి సరిపడా నీళ్లు కలపాలి. పిండిని వేడి పెనం మీద వేసుకోవాలి. చుట్టూ నూనె వేసి రెండు వైపులా దోరగా కాల్చుకోవాలి. దీన్ని కొబ్బరి లేదా అల్లం పచ్చడితో కలిపి తీసుకోవచ్చు. లాభాలు: తక్కువ కేలరీలు, ఎక్కువ పోషకాలు లభిస్తాయి. మధుమేహంతో బాధపడేవాళ్లు జొన్న దోశెలను అల్పాహారంగా తీసుకుంటే మంచిది. రుచికి అల్లం, వెల్లుల్లి, వేసుకోవచ్చు. వీటిలోనూ పోషక విలువలు అపారం.


చదువు కెంతొ విలువ
జనులిచ్చుచుందురు!
ఆనులైనులంటుఆర్తినొందె!
పిల్లలచదువులకు
యెళ్ళవేళలయందు!
బెదురుచుంద్రుమరల
నదురుచుంద్రు



**– మల్లాది సోమేశ్వర శర్మ,**
**9603995769**



# మార్పు అవసరం



"థియేటర్, ఓటీటీ.. రెండూ వేరు అయిన ప్పటికీ ఓటీటీలో సినిమాల విడుదలను పాజిటివ్‌గా చూడాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో సినిమా ఇండస్ట్రీ ఎటువంటి ఆటంకాలు లేకుండా ముందుకు వెళ్లాలంటే టెక్నాలజీ పరంగా ఆడియన్స్‌కి ఎంటర్‌టైన్‌మెంట్ ఇవ్వడంలో ఇలాంటి మార్పులు రావడం అవసరం. వాటిని అందరూ స్వాగతించడం కూడా చాలా అవసరం" అన్నారు అనుష్క. హేమంత్ మధుకర్ దర్శకత్వంలో అనుష్క, మాధవన్ జంటగా అంజలి ముఖ్య పాత్రలో నటించిన చిత్రం 'నిశ్శబ్దం'. కోన ఫిల్మ్ కార్పొరేషన్ సహకారంతో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 2న అమేజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా అనుష్క చెప్పిన విశేషాలు. 'భాగమతి' చిత్రం తర్వాత కావాలని గ్యాప్ తీసుకున్నా. ఆ సమయంలో కోన వెంకట్‌గారు, హేమంత్ గారితో 'నిశ్శబ్దం' కథ వినిపించారు. ఇందులో నా పాత్ర వైవిధ్యంగా ఉండటంతో పాటు సినిమా కూడా బాగుంటుందని బలంగా అనిపించి, నటించడానికి ఒప్పుకున్నాను. తొలిసారి నేను నటించిన సినిమా ఓటీటీలో విడుదలవ్వడం నాకు కాస్త కొత్తగా అనిపిస్తోంది. ఈ చిత్రంలో నాది చెవిటి, మూగ అమ్మాయి పాత్ర. నేను ఈ సినిమా చేయడానికి కారణం నా పాత్రకున్న ప్రత్యేకతే. ఈ పాత్ర కోసం కొన్నాళ్లు ఇండియన్ సైన్ లాంగ్వేజ్ నేర్చుకున్నాను. అయితే షూటింగ్‌కి అమెరికా వెళ్లాక అందరూ ఎక్కువగా వాడే సైన్ లాంగ్వేజ్‌ని అక్కడి ఓ 14 ఏళ్ల అమ్మాయి దగ్గర శిక్షణ తీసుకుని నటించాను. మాధవన్‌గారితో నా కెరీర్ తొలినాళ్లలో నటించాను. మళ్లీ ఇన్నాళ్లకు నటించడం వండర్‌ఫుల్‌గా అనిపించింది. ఈ కథ కేవలం మా ఇద్దరి చుట్టూనే తిరగదు.. స్క్రీన్‌ప్లే ముందుకు నడిపించడంలో మిగతా పాత్రలు కూడా కీలకంగా మారుతుంటాయి. హేమంత్ ఈ చిత్రాన్ని అత్యద్భుతంగా తెరకెక్కించారు. ఈ ప్రయోగాత్మక కథని అమెరికా బ్యాక్‌డ్రాప్‌లో ఎక్కడా రాజీ పడకుండా నిర్మించడం అంత సులువు కాదు.. దానికి చాలా ప్యాషన్, ధైర్యం కావాలి.. ఆ రెండూ ఉన్న నిర్మాతలు విశ్వప్రసాద్, కోన వెంకట్‌గార్లు. థ్రిల్లర్ సినిమాలకి నేపథ్య సంగీతానికి చాలా ప్రాధాన్యత ఉంటుంది. అయితే ఓటీటీలో విడుదలవడంలో ఉన్న ఒకే ఒక డ్రాబ్యాక్ ఇదే. థియేటర్స్‌లో ఉండే సౌండ్ సిస్టమ్, ఆడియో క్వాలిటీని ప్రేక్షకులు మిస్ అవుతారు.

## షూటింగ్‌లో పాల్గొన్న విద్యాబాలన్..



ముంబై: కొవిడ్ మహమ్మారి విజృంభణ పరిస్థితుల్లోనూ తాను షూటింగ్‌లో పాల్గొంటున్నానని హీరోహిన్ తాప్సీ పన్ను ఇటీవల ఫొటోలు షేర్ చేసిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆమె బాటలో మరో బాలీవుడ్ భామ విద్యాబాలన్ షూటింగ్ తిరిగి ప్రారంభించినట్లు ప్రకటించింది. వ్యాంటీ వ్యాన్‌లో పీపీఈ కిట్లు ధరించిన సిబ్బందితో కలిసి కూర్చున్న ఫొటోను ఆమె ఇన్‌స్టాగ్రాంలో పోస్ట్ చేసింది. ప్రస్తుతం విద్యాబాలన్ 'శకుంతలదేవి' చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాలో గణితదేవి శకుంతలదేవి టైటిల్ రోల్‌ను ఆమె పోషిస్తోంది. సన్యా మల్హోత్రా, అమిత్‌సాధ్ కూడా ఇందులో నటిస్తున్నారు. ఈ చిత్రం ఈ నెల 31న ఓటీటీలో విడుదల కానుంది.

# లూసీఫర్ రీమేక్‌లో విజయ్ దేవరకొండ!



మలయాళంలో మోహన్‌లాల్ నటించిన చిత్రం 'లూసీఫర్'. అక్కడ ఘనవిజయం సాధించిన ఈచిత్ర రీమేక్ హక్కులను కథానాయకుడు రామ్‌చరణ్ సొంతం చేసుకున్నారు. తన తండ్రి చిరంజీవితో ఆ సినిమాను రీమేక్ చేయాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్ పోషించిన పాత్రను రామ్‌చరణ్ చేయాలని భావించాడు. అయితే కొరటాల శివ దర్శకత్వంలో చిరంజీవి కథానాయకుడిగా రూపొందుతున్న 'ఆచార్య' చిత్రంలో రామ్‌చరణ్ ఓ కీలకపాత్రను పోషిస్తున్నాడు. అందుకే లూసీఫర్ రీమేక్‌లో పృథ్వీరాజ్ పాత్రలో విజయ్ దేవరకొండను తీసుకోవాలని భావిస్తున్నాడు. ఇందుకు సంబంధించిన చర్చలు కూడా జరిగాయట. ఇక అధికారికంగా త్వరలోనే దీనికి సంబంధించిన ప్రకటన రాబోతుంది. 'సాహో' దర్శకుడు సుజిత్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తాడు.



# అమ్మాయితో మస్తీ

ముంబై : పోర్న్ ఇండస్ట్రీ నుంచి బాలీవుడ్ లోకి అడుగు పెట్టిన శృంగార తార సన్నిలియోన్ లాక్ డౌన్‌కు ముందే తన నేటివ్ ప్లేస్ అమెరికాకు వెళ్లింది. తాజాగా ఈ అందాల రాక్షసి తన ఇన్‌స్టాగ్రామ్ పేజ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. తన స్నేహితురాలితో కలిసి స్విమ్మింగ్ పూల్‌లో ఎంజాయ్ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియోలో సన్నీ బ్లాక్ కలర్ మోనాకినీలో సెక్సీగా కనిపిస్తూ అందరి మదిని దోచుకుంటున్నది. వీడియోతో పాటు మస్తీ మస్తీ మస్తీ ఓ అమ్మాయితో అంటూ కామెంట్ చేసింది. ప్రస్తుతం ఈ బ్యూటీ అమెరికాలో తన ఫ్యామిలీతో కలిసి జాలీగా గడుపుతున్నది.

# ఇలియానా గాలి వీచడం లేదు!

ఉవ్వెత్తున ఎగసిపడిన అల అంతలోనే చల్లబడిపోతుందని ఎవరూ అనుకోలేదు. కానీ ఆ అల అలాగే పడిపోయింది. తన వయ్యారాల్ని తొలినాళ్లలో అద్భుతంగా ప్రదర్శించిన ఆ తార మళ్లీ ఎప్పటికైనా మునుపటి ఉత్తుంత తరంగంలా దూసుకు వస్తుందని ఇప్పటికీ ఆమె ఆరాధకులు ఆశిస్తూనే ఉన్నారు. ఆ అల.. ఇలియానా! వైవీఎస్ చౌదరి తీర్చిదిద్దిన 'దేవదాసు'తో గ్రాండ్‌గా తెరంగేట్రం చేసి, పూరి జగన్నాథ్ రూపొందించిన 'పోకిరి'తో యువ హృదయాల్ని కిరికిరి చేసి, తెలుగు చిత్రరంగంలో హాటెస్ట్ హీరోయిన్‌గా అవతరించిన ఆమె ఆ తర్వాత వేసిన అడుగులు పట్టుతప్పాయి. రవితేజ సరసన చేసిన 'ఖతర్నాక్' ఒక పీడకలగా నిలిచింది. కృష్ణవంశీ 'రాఖీ' పరువునిలిపినా బాక్సాఫీస్ దగ్గర పట్టువిడిచింది. ప్రభాస్‌తో చేసిన 'మున్నా'దీ అదే దారి. అభినవ సిమ్రాన్‌గా విమర్శకుల చేత ప్రశంసలు పొంది, యువతరంలో అమిత అభిమానాన్ని సంపాదించిన ఓ తార అంతలోనే మాయమవుతుందేమోనన్నే సందేహం కలిగింది విశ్లేషకుల్లో. అంతలో వచ్చింది 'ఆట'. తన లావణ్యంతో వెండితెరని ఓ ఆట ఆడించేసింది ఇలియానా. ఆమె తడితడి అందాల్ని చూసి, యువతరానికే కాదు, వయసుమళ్లిన వాళ్లకే మతులు పోయాయి. కాపీ సినిమాగా పెదవి విరచిన విమర్శకుల ప్రచారాన్ని తట్టుకొని 'ఆట' ఆడిందంటే, ఆ సినిమాలో ఇలియానను చూసేందుకే ప్రేక్షకులు మళ్లీ మళ్లీ రావడం కారణం. అప్పట్లో టాప్ ర్యాంక్‌లో ఉన్న త్రిషకు పక్కలో బల్లెంలా మారింది ఇలియానా. త్రివిక్రమ్ డైరెక్ట్ చేసిన 'జల్సా'లో పవన్ కల్యాణ్ జోడీగా అదరగొట్టడంతో త్రిషను దాటేస్తుందని అందరూ ఆశించారు. 'భలేదొంగలు' ఓ మోస్తరుగా ఆడినా, రవితేజతో నటించిన 'కిక్' సినిమా ఆమెను టాప్ హీరోయిన్‌ను చేసింది. ఆ సినిమాలో ఇలియానా యోగా భంగిమలు కుర్రకారు మతులు పోగొట్టాయి. అలాంటి టైమ్‌లో స్క్రిప్టుల విషయంలో జాగ్రత్త పడకుండా చేసిన రెచ్చిపో, సలీమ్, శక్తి, నేను నా రాక్షసి సినిమాలు ఒకదాని తర్వాత ఒకటిగా దారుణ పరాజయాన్ని అందించాయి. అల్లు అర్జున్ సరసన చేసిన 'జులాయి' వచ్చి ఆమెను తిరిగి రేసులో నిలిపింది. అప్పుడే తన కెరీర్ దిశను మార్చే నిర్ణయం తీసుకుంది ఇలియానా. అది.. బాలీవుడ్‌కు వెళ్లాలని. టాలీవుడ్‌లో ఎన్ని సినిమాలు చేసినా తన గుర్తింపు ఇక్కడికే పరిమితమవుతుందని అనుకుందేమో హిందీలో రణబీర్ కపూర్‌తో 'బర్ఫీ' సినిమా చేసింది. అందులో సెకండ్ హీరోయిన్‌గా చేసినప్పటికీ, సినిమా సూపర్ హిట్టవడంతో ఇలియానాకు మంచి గుర్తింపే లభించింది. ఈలోపు తెలుగులో విడుదలైన 'దేవుడు చేసిన మనుషులు' మూవీ డిజాస్టర్ అయినా ఆమె పెద్దగా కలత చెందలేదు. తెలుగులో వచ్చిన ఆఫర్లను వదులుకొని హిందీ సినిమాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఆమె చేసిన పొరపాటుగా విశ్లేషకులు అభిప్రాయపడతారు. హిందీలో వరుసగా సినిమాలైతే చేసింది కానీ, ఏనాడూ టాప్ లీగ్‌లోకి ఆమె ప్రవేశించలేకపోయింది. అపురూప లావణ్యరాశిగా పేరుపొందిన ఇలియానా ప్రభ మసకబారడం మొదలైంది. ఫటా పోస్టర్ నిఖ్‌లా హెూగా, మై తేరా హీరో, హ్యాపీ ఎండింగ్, రుస్తోమ్, ముబారకన్, బాద్‌షాహెూ, రెడ్ వంటి సినిమాలు చేసినా ఆమె కీర్తి పెరగలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఆమె పరిస్థితి మారిపోయింది. ఈలోపు సంవత్సరాలు గడిచిపోయాయి. తెలుగువాళ్లు ఆమెను దాదాపు మరచిపోయ్యారు. అప్పుడు టాలీవుడ్ గుర్తుకొచ్చింది అమ్మడికి. పాత స్నేహితుడు రవితేజతో నాలుగోసారి జోడీకట్టి 'అమర్ అక్బర్ ఆంటోని'లో నటించింది. అది డిజాస్టర్! ఆ తర్వాత హిందీలో చేసిన 'పాగల్‌పంతి' మరో డిజాస్టర్!! ఇప్పుడు ఒకప్పటి స్టాక్ బ్రోకర్ హర్షద్ మెహతా జీవితం ఆధారంగా రూపొందుతోన్న 'బిగ్ బుల్' మూవీలో అభిషేక్ బచ్చన్‌తో కలిసి నటిస్తోంది ఇలియానా. కానీ ఆనాటి మెరుపులు ఆమెలో కనిపించడం లేదనేది చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఒక్కోసారి తీసుకున్న నిర్ణయం కెరీర్‌ను డౌన్ చేస్తుందనేందుకు ఇలియానా ఉదంతమే ఓ ఉదాహరణ. ఎలాంటి స్థితిలో ఉండాల్సిన మెరుపుకన్య ఎలాంటి స్థితిలో ఉంది?!





# వింతగాథలో తమిళ అమ్మాయిగా సీరత్ కపూర్..

బాలీవుడ్ సినిమాలకి అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ గా పనిచేసి, శర్వానంద్ హీరోగా తెరకెక్కిన రన్ రాజా రన్ సినిమాతో హీరోయిన్ గా మారిన సీరత్ కపూర్, ప్రస్తుతం ఫుల్ హ్యాపీగా ఉందట. అయితే దానికి కారణం ఆమె నటించిన తెలుగు చిత్రం క్రిష్ణ అండ్ హిస్ లీల కి ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ రావడమే. డైరెక్ట్ నెట్ ఫ్లిక్స్ లో రిలీజైన ఈ చిత్రానికి ప్రేక్షకులు పాజిటివ్ గా స్పందించారు. ఈ సినిమాలో సీరత్ కపూర్ రుక్సార్ అనే పాత్రలో కనిపించింది. అయితే రన్ రాజా రన్ తర్వాత సీరత్ కపూర్ చాలా సినిమాలే చేసినప్పటికీ ఏదీ సరైన గుర్తింపు తీసుకురాలేదు. కానీ ఓటీటీలో రిలీజ్ అయిన క్రిష్ణ అండ్ హిస్ లీల చిత్రంలో ఆమె పాత్రకి గుర్తింపు దక్కింది. ఇద్దరు అమ్మాయిలని ఒకేసారి ప్రేమిస్తూ ఒకరకమైన కన్ఫ్యూజన్ లో ఉండే అబ్బాయి స్నేహితురాలిగా రుక్సార్ పాత్రలో సీరత్ కపూర్ చాలా చక్కగా నటించింది. అయితే ప్రస్తుతం సీరత్ కపూర్ కొత్త చిత్రం రిలీజ్ కి రెడీ కాబోతుందని సమాచారం మా వింతగాధ వినుమా అనే విభిన్నమైన టైటిల్ తో తెరకెక్కిన ఈ చిత్రంలో సీరత్ కపూర్ హీరోయిన్ గా నటిస్తుంది. అయితే ఈ సినిమాలో ఆమె తమిళ అమ్మాయిగా కనిపించనుందట. ఈ సినిమా తన కెరీర్లో మంచి చిత్రంగా నిలవనుందని అంటోంది. మరి సినిమా రిలీజ్ అయితేగానీ విషయం ఏంటనేది ఎవ్వరికీ తెలీదు.



# నటిని అవ్వాలని అనుకోలేదు..!

హీరోయిన్ నిత్యా మీనన్ ఎప్పుడూ నటిని అవుతానని కానీ, అవ్వాలని కానీ అనుకోలేదట. ఎప్పుడు చదువుపైనే ధ్యాస పెట్టేదట. ఈ విషయం నిత్యా మీనన్ చెబుతుంది. పాత్రకు ప్రాధాన్యం ఉన్న సినిమాల్లో నటించి గ్లామర్‌తోనే కాదు.. నటనతోను కెరీర్‌ని దున్నేయ్యవచ్చని నిరూపించిన నటి నిత్యా మీనన్. అయితే తాజాగా తనకి సినిమాలోకి రావాలనే ఆశ లేదని చెబుతుంది. మీరు సినిమాల్లోకి ఎంటరైనప్పుడు ఎదుర్కొన్న సవాళ్లేమిటి... ఎన్ని ఆడిషన్స్ లో మిమ్మల్ని రిజెక్ట్ చేసారు అని అడిగిన ప్రశ్నలకు.. నేను నటిని అవ్వాలని అనుకుంటే.. ఆడిషన్‌కి వెళ్లాల్సి వచ్చేది. కానీ నా దృష్టి ఎప్పుడు చదువుపైనే ఉండేది. మాస్టర్స్ చెయ్యాలి. తర్వాత పిహెచ్‌డి చేసి విదేశాలకు వెళ్లిపోవాలని, అక్కడే సెటిలవ్వాలని ఉండేది. కానీ నటిని అవ్వాలని ఎప్పుడు అనుకోలేదు. అయితే విధి రాత మార్చలేము కదా అంటుంది. నేను వద్దనుకున్నా సినిమా రంగం నన్ను ఆహ్వానించింది. నేను ఎలాంటి ఆడిషన్స్ కి, ఫ్యాషన్ షోలకి వెళ్లకుండానే నాకు అవకాశాలొచ్చాయి. అందుకే ఆడిషన్స్ లో రిజెక్ట్ అవడం కానీ, నన్ను వద్దనే వాళ్ళు కానీ లేరు. నా మనసుకు నచ్చిన కథలని ఎంపిక చేసుకుని సినిమాలు చేశాను. కాకపోతే నాలుగేళ్ళ వరకు నేను సినిమాలను అంత నటనను అంత సీరియస్ గా తీసుకోలేదు. కానీ ఇప్పుడు నటనపై పూర్తిగా సీరియస్ గా దృష్టి పెట్టా అంటుంది నిత్య మీనన్.

# 'ఆచార్య' జోరు చూపించేదెప్పుడో?



2020 జనవరిలో 'అల.. వైకుంఠపురములో', 'సరిలేరు నీకెవ్వరు' సినిమాల ఫీవర్‌తో వెర్రెత్తిన తెలుగు ప్రేక్షకులు 2021 జనవరిలో 'ఆచార్య' వస్తాడని ఆరాటంగా ఎదురు చూస్తున్నారు. మూడు దశాబ్దాల పాటు తెలుగు చిత్రసీమ అగ్ర కథానాయకుడిగా వెలిగిన చిరంజీవి నటిస్తోన్న ఈ సినిమా వాస్తవానికి ఈ ఏడాది అక్టోబర్‌కే ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. కరోనా మహమ్మారి కరాళ నృత్యం లేనట్లయితే మెగా ఫాన్స్ సంబరాలు చేసుకోవడానికి సన్నాహాలు చేసుకుంటూ ఉండేవాళ్లు. ప్రచారంలో ఉన్న దాని ప్రకారం సామాజిక కార్యకర్తగా మారిన నక్సలైట్‌గా మెగాస్టార్ కనిపించనున్న ఈ సినిమాకు కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్నాడు. మహేష్‌తో చేసిన హిట్ ఫిల్మ్ 'భరత్ అనే నేను' తర్వాత అతను పనిచేస్తున్న సినిమా ఇదే. చిరంజీవి కమ్‌బ్యాక్ ఫిల్మ్ 'ఖైదీ నంబర్ 150', 'సైరా.. నరసింహారెడ్డి' చిత్రాల్ని నిర్మించిన రామ్‌చరణ్ ఈ సినిమాని నిరంజన్‌రెడ్డి అనే మరో నిర్మాతతో కలిసి నిర్మిస్తున్నాడు. 'సైరా' తర్వాత చిరంజీవి నటిస్తోన్న ఈ సినిమాపై సహజంగానే అంచనాలు అంబరాన్ని తాకుతున్నాయి. ఇంతదాకా నిర్మాతలు ఎలాంటి ప్రచారాన్నీ ఇవ్వకుండా లోప్రొఫైల్‌లో ఈ సినిమాని నిర్మిస్తున్నప్పటికీ, ఆ సినిమా గురించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తూనే వస్తోంది మీడియా. 'సైరా'లో తొలినాటి స్వాతంత్ర్యసమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డిగా కనిపించిన మెగాస్టార్, ఈ సినిమాలో టైటిల్‌కు తగ్గట్లు సమాజాన్ని ప్రభావితం చేసే ఒక గౌరవప్రదమైన పాత్రను చేస్తున్నారు. 'ఖైదీ నంబర్ 150'లో 'అమ్మడూ లెట్స్ డు కుమ్ముడూ' అన్న చిరంజీవితో కలిసి స్టెప్పులేసిన సీనియర్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి ఈ చిత్రంలో ఆయనతో జోడీ కడుతోంది.

# 'ఆర్ఆర్ఆర్' తరువాత 'సభకు నమస్కారం'



రామ్ చరణ్, ఎన్టీఆర్ కాంబోలో రాజమౌళి భారీ బడ్జెట్‌తో ఆర్ఆర్ఆర్ సినిమా చేస్తున్నాడు. ఈ సినిమాపై పాన్ ఇండియా లెవల్లో భారీ అంచనాలు, క్రేజ్ ఉంది. అయితే ఇలాంటి పాన్ ఇండియా మూవీ తర్వాత ఎన్టీఆర్ బ్లాక్ బస్టర్ డైరెక్టర్ త్రివిక్రమ్‌తో కమిట్ అయ్యాడు. ఎన్టీఆర్ తదుపరి టైటిల్ కూడా అయినను పోయిరావలె హస్తినకు అంటూ ప్రచారం లో ఉంది. ఈ సినిమాపై కూడా భారీ అంచనాలే ఉన్నాయి. అయితే రామ్ చరణ్ మాత్రం ఇంతవరకు తన తదుపరి చిత్రాన్ని అనౌన్స్ చెయ్యకుండా మెగా ఫాన్స్ ని కన్ఫ్యూజ్ చేస్తున్నాడు. ఆచార్యలో గెస్ట్ రోల్ తప్ప రామ్ చరణ్ నెక్స్ట్ పై ఇంకా సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. అయితే తాజాగా ఆర్ఆర్ఆర్ లాంటి భారీ సినిమా తర్వాత మరో ఇంకాస్త హైప్‌తో మరో సినిమా చెయ్యడం ఎందుకు రిస్క్ అందుకే.. కాస్త అంటే ఎలాంటి క్రేజ్ లేకుండా ఓ చిన్న సినిమా చెయ్యాలని రామ్ చరణ్ డిసైడ్ అయ్యాడట.

# తిరుపతి, నెల్లూరు, కర్నూలు, కడప




## స్థానిక సమస్యలపై దృష్టి పెట్టండి

### కార్పొరేషన్ కమిషనర్‌కు సిపిఎం విజ్ఞప్తి



**కడప, వార్తావళి, సెప్టెంబర్ 30 :** కడప నగరంలో గత కొద్ది రోజులుగా వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరంలోని పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.రామమోహన్ , సిపిఎం నగర నాయకులు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నాడు కడప నగరంలో ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలైన లోహియానగర్ , బిల్టప్, అక్కాయ్యపల్లె తదితర ప్రాంతాలను సిపిఎం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా కడప మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారుల బృందాన్ని సిపిఎం నేతలు అహ్మదీయనగర్, లోహియా నగర్ ఈ ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్కు ఇతర అధికారులకు సమస్య తీవ్రతను వివరించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ కడప నగరంలో వర్షాలు కురిస్తే లోహియనగర్ ప్రాంతంలో వర్షపు నీరు ఎక్కడి కక్కడ నిలబడి చెరువులను తలపించే విధంగా ఉందన్నారు. ఈ ప్రాంతంలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ చాలా అధ్వానంగా ఉందన్నారు. వర్షపు నీరు బయటకు పంపేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టడంలో నగర కార్పొరేషన్ అధికారులు, పాలక యంత్రాంగం ఘోరంగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ , స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రతిభకు పేదరికం అడ్డుకాదు

### జిల్లా కలక్టరు డా. ఎం. హరి జవహర్‌లాల్



**విజయనగరం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్ (ఐఐఎం) లో జాతీయ స్థాయిలో 17వ ర్యాంకు సాధించిన గుమ్మడి వెంకట కె హిమజా శ్రావణికి జిల్లా కలక్టరు డా. ఎం. హరి జవహర్ లాల్ అభినందనలు తెలిపారు. వేపాడ మండలం వేపాడ గ్రామానికి చెందిన శ్రావణి తండ్రి గుమ్మడి శ్రీను, తల్లి కృష్ణవేణితో కలిసి బుధవారం కలక్టరు ఛాంబరులో కలక్టరును కలిసారు. కలక్టరు హరి జవహర్ లాల్ స్పందిస్తూ ప్రతిభకు పేదరికం అడ్డం కాదని, గ్రామీణ ప్రాంతంలో జన్మించి మంచి ర్యాంకు సాధించడం గొప్ప విషయమన్నారు. చిరుద్యోగులైన వారి తల్లిదండ్రుల ఆశయాలను నిజం చేసి తన గురువులకు, మంచిపేరు తీసుకువచ్చిందని శ్రావణి భవిష్యత్తులో మరింత ఉత్తమ స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రతిభ ఉన్న పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే వారిలో ఉత్సాహం పెరిగి వారి సమర్థతను చాటగలరని చూపిన శ్రావణి అభినందనీయరాలన్నారు. ఎంతోమంది బాలికలకు స్ఫూర్తిగా నిలిచిందని అభినందిస్తూ శ్రావణి, తన తల్లిదండ్రులకు పుష్ప గుచ్చాలు అందజేసి, శాలువాతో సత్కరించారు.

## బీమా పంపిణీలో అత్యంత వేగవంతమైన వృద్ధి

### ఫోన్‌పే ద్వారా 5 నెలల్లోనే 5 లక్షల పాలసీలు విక్రయం

**విశాఖపట్నం,** ఏప్రిల్–ఆగస్టు 2020 మధ్యకాలంలో తాము 5 లక్షలకు పైగా బీమాపాలసీలు విక్రయించామని భారతదేశపు ప్రముఖ డిజిటల్పేమెంట్ల వేదిక ఫోన్‌పే ఈరోజుప్రకటించింది. ఇదిఫోన్‌పే యాప్లోబీమా విభాగాన్నిప్రవేశపెట్టిన 9 నెలల్లోపే భారతదేశంలో అత్యంత వేగంగా వృద్ధి సాధించిన బీమా–టెక్పంపిణీదారుగా ఫోన్‌పేకు ఘనత దక్కేలా చేసింది. ఈఏడాది జనవరిలో ఫోన్‌పే బీమారంగంలో పవేశపెట్టింది. తద్వారా వ్యాపార, విహార ప్రయాణీకుల కోసం అంతర్జాతీయ ప్రయాణ బీమాను ఆవిష్కరించిన మొట్టమొదటి డిజిటల్పేమెంట్వేదికగా నిలిచింది. ఏప్రిల్నుంచి అది అంతర్జాతీయ ప్రయాణబీమాతో పాటుకొవిడ్–19 బీమా, స్వదేశీప్రయాణ బీమా, ఆసుపత్రిడైలీక్యాష్, డెంగ్యూ, మలేరియా బీమా, పర్సనల్యాక్సిడెంట్కవర్పేర్లతోమరో 5 బీమాఉత్పత్తులనుప్రవేశపెట్టింది. ఇదే తరహా ఉత్పత్తులను అభివృద్ధి చేసి, ఆవిష్కరించడానికి సాధారణంగా ఈరంగం కొన్నినెలలపాటు సమయం తీసుకునే విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటే, ఈఉత్పత్తులను అతితక్కువ సమయంలోనే ఆవిష్కరించడం ప్రాముఖ్యత సంతరించుకుంది. గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఫోన్‌పే తన ఉత్పత్తులను మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రూపొందించింది. 23 కోట్లను దాటిన తన వినియోగదారుల కోసం అనుకూలింపజేసిన ఉత్పత్తులను అందించడంకోసం ప్రముఖ బీమాసంస్థలతోనూ భాగస్వామ్యంకుదుర్చుకుంది. దేశంలో కరోనా మహమ్మారి వేగంగా విజృంభిస్తున్న తరుణంలో, అంటేఏప్రిల్, మేనెల్లో కొవిడ్–19 కోసం చౌకధరతో కూడిన ఒకబీమాఉత్పత్తిని ఫోన్‌పే ఆవిష్కరించింది.

## విపత్తుల సమయంలో ప్రాణనష్టం నియంత్రిచాలి

### వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




**విశాఖపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 30:** విపత్తుల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాలను నియంత్రించే దిశగా నిపుణులు పనిచేయాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం ఏయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐడిఎం) సంయుక్తంగా నిర్వహించిన ' డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ ఇన్ రెసిలియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఆన్‌లైన్ వెబినార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ హుద్‌హుద్ అనంతరం విశాఖ నగరంలో జరిగిన నిర్మాణాలలో తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను వివరించారు. ఐఐటి మద్రాసు ఆచార్యులు సి.వి.ఆర్ మూర్తి ఎర్త్‌క్వేక్ రిసెస్టెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఐఐఎస్‌సి బెంగళూరు ఆచార్యులు ప్రదీప్ ముజుబ్‌దార్ అర్బన్ ఫ్లడ్స్– ఏన్ ఇవాల్వింగ్ చాలెంజెస్' అంశంపై ప్రసంగించారు. కార్యక్రమంలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు, సదస్సు కన్వీనర్ ఆచార్య సి.ఎన్.వి సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ అమీర్ ఆలీ ఖాన్, విభాగాధిపతి ఆచార్య టి.వి ప్రవీణ్, ఆచార్య డి.ఎస్.ఆర్ మూర్తి తదితరులు ప్రసంగించారు. సదస్సుకు 300 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్లు ఇలా మరి ప్రయాణాలు సాగేదెలా ?

### గోతులమయ రోడ్లతో వాహన చోదకులు అవస్థలు-పట్టించుకోని అధికారులు



**మాడుగుల, వార్తవళి సెప్టెంబరు 30 :** కనీసం నడవడానికి కూడా వీలు పడని విధంగా ఆర్‌అండ్‌బి బీటీ రోడ్లు గోతుల మయంగా మారితే, ఆ శాఖ అధికారులకు కనీసం చలనం లేకుండా పోతుందని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. చిన్న చిన్న విషయాలకు ఎంతో హడావిడి చేసే ఆర్‌అండ్‌బి అధికారులు నిత్యం వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రోడ్డు ఇలా గోతుల మయంగా మారినా.. పట్టించుకునే పరిస్థితి లేదన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఒక వేల ఇలాంటి సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకుందామని తాచేరు సమీపాన ఉన్న ఆర్‌అండ్‌బి కార్యాలయానికి వెళ్ళిన పరిస్థితుల్లో, అక్కడున్న కార్యాలయానికి నిత్యం తాళాలు వేసి దర్శనమిస్తుంది. ఆర్‌అండ్‌బి అధికారులు తీరు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.మాడుగుల మండలం ఘాటీరోడ్ జంక్షన్‌లో గల బీటీరోడ్డు ఎప్పటి నుంచో గోతుల మయంగా మారి ప్రయాణాలు సాగించే ప్రయాణికులకు ఇబ్బంది కరంగా మారింది. ఈ మధ్య కాలంలో కురుస్తున్న అడపా దడపా వర్షాలకు వర్షపునీరు గోతుల్లోకి చేరి రోడ్డుకి సమాంతరంగా కనిపించడంతో, గోతులున్నాయన్న విషయాన్ని కూడా వాహన చోదలకులు గమినించలేని పరిస్థితి ఏర్పాడుతుందని, దీంతో వాహన చోదల వాహనాలు గోతుల్లో ఒక్కసారిగా దిగి మరామత్తులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య చాలా కాలంగా ఉన్నప్పటికీ అధికారులెవరూ స్పందించే పరిస్థితి లేకుండా పోయిందని ఆ ప్రాంత ప్రజలు, వాహన చోదకులు అంటున్నారు. ఇదే మాదిరిగా ఘాటీరోడ్డు జంక్షన్ నుంచి కేజే పురం జంక్షన్‌కి వెళ్ళేంత వరకు దారిపొడుగున పడిన గోతులకు గాను ప్రయాణాలు సాగించడం చాలా అవస్థలుగా మారింది. అదే విధంగా ఆర్‌అండ్‌బి రోడ్డు మరామత్తులకు గురవ్వడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో ఉన్న ఆర్‌అండ్‌బి రోడ్లకు ఇరువైపుల వేపుగా ఎదిగిన తుప్పలు తొలగించేందుకు కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. అసలు ఇలాంటి మరామత్తులు చేపట్టేందుకు మెయింటినెన్స్ నిధులైనా మంజూరవుతున్నాయా ? లేక మంజూరవుతున్నా ఖర్చు చెయ్యకుండా మూలన పెడుతన్నారా అన్న విషయం తెలియాల్సి ఉంది. అసలు మాడుగుల మండలంలో సమస్యలు ఉన్నాయా.. లేవా అనువిషయాన్ని కనీసం అధికారులు గుర్తించారా లేదా అన్నది సందిగ్ధమే. ఇప్పటికైన ఇలాంటి సమస్యలపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకొని గోతులు పడిన రోడ్లుకి మరామత్తులు చెయ్యాలని కోరుతున్నారు. అదే విధంగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కార్యాలయాల్లో ఉండేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**విధ్యుత్ సబ్‌స్టేషన్ రోడ్డు అస్థవస్థం**

అదే విధంగా స్థానిక విధ్యుత్ శాఖకు వెళ్ళే మట్టిరోడ్డు పరిస్థితి కురిసిన వర్షానికి గాను బురదమయంగా మారింది. దీంతో నిత్యం విదుత్ సమస్యలపై సబ్‌స్టేషన్‌కి వచ్చి పోయే వినమాగ దారులు కారణంగా మారీ అధ్వనంగా తయారయ్యిందని అటుగా రాకపోకలు సాగించే వారు ఆరోపిస్తున్నారు. సబ్‌స్టేషన్ నుంచి వివిధ పనులపై వెళ్ళాలన్న చాలా ఇబ్బంది కరంగా మారిందని, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకొని బురదమయంగా ఉన్న రోడ్డుకి తాత్కాలికంగా అయినా మరామత్తులు చేపట్టాలని కోరుతున్నారు.



## రెండవ రోజుకు చేరుకున్న నూతన వ్యవసాయ బిల్లు వ్యతిరేఖ దీక్షలు




**చోడవరం, సెప్టెంబర్ వార్తావళి 30:** కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ బిల్లును రద్దు చేయాలంటూ సి.పి.ఐ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో చోడవరం తహశీల్దారు కార్యాలయం వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారానికి రెండవరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రెడ్డిపల్లి మాట్లాడుతూ వ్యవసాయాన్ని కార్పోరేట్లకు తాకట్టు పెట్టేందుకు ఆలోచిస్తున్న ప్రభుత్వ నిర్ణయాలు సరియైనవి కాదన్నారు. వ్యవసాయ బోర్లకు కొత్త విద్యుత్తు మీటర్లు అమరిస్తే, నెలవారి విద్యుత్తు బిల్లులు చెల్లించలేక అన్నదాతల ఆత్మహత్యలు పెరుగుతాయని తెలిపారు. దీనికి ప్రభుత్వాలే బాధ్యత వహించాలని. నూతన వ్యవసాయ బిలుల్నఉ తక్షణమే రద్దు చేయాల్సిందిగా డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నేమాల నర్సింగరావు, కురుగోడు గోవింద, సత్యనారాయణ, గరికిపాటి మానీలు, చింతల కొండబాబు, రెడ్డి శ్రీరామ్మూర్తి, రమణబాబు పాల్గొన్నారు.

## 2024లో కమల వికాసం ఖాయం

**రాజమహేంద్రవరం, సెప్టెంబర్ వార్తావళి 30:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024లో కమల వికాసం ఖాయమని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జ్ కె.భానుప్రకాష్ రెడ్డి ధీమా వ్యక్తం చేసారు. హిందు సంప్రదాయాలు, తిరుమల డిక్లరేషన్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన రాష్ట్ర మంత్రి కొడాలి నాని తక్షణం కేబినెట్ నుంచి భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసారు. రాజమహేంద్రవరానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ కురగంటి సతీష్ ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు.

## పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : సిడిపిఓ నాగమణి

**పెదబయలు, సెప్టెంబర్ వార్తావళి 30:** పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సి డి పి ఓ నాగమణి తెలిపారు. సీత గుంట .అడుగుల పుట్టు పంచాయతీ తామరాడ అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం మహోత్సవాలను నిర్వహించారు .రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైయస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా అందిస్తున్న పోషకాహారం కిట్లు లను సద్వినియోగం చేసుకోవాలన్నారు .గర్భి ణీలు బాలింతలు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలనీ సూచనలు సల హాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాజ్యలక్ష్మి .అంగ న్వాడీ కార్యకర్తలు మంగ .రూపవతి తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై వేధింపులు దారుణం : వరుపుల రాజా

**పెదబయలు, సెప్టెంబర్ వార్తావళి 30:** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక దళితులపై వేధింపులు చేయడం దారుణం ప్రత్తిపాడు టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వరుపుల రాజా అన్నారు. ప్రత్తిపాడు మండలం చిన్న శంకర్ల పూడి గ్రామంలో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. వరుపుల రాజా మాట్లాడుతూ ప్రభుత్వం కరోనా విజృంభిస్తున్న గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది అని రాజా అన్నారు. గత నెల రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు దారుణంగా ఉన్నాయని గ్రామీణ ప్రాంతాల్లో రహదారిపై పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో ప్రజలను అనారోగ్యాలు వెంటాడుతున్న అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని రాజా పేర్కొన్నారు.

## చీడికాడ మండలంలో జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన



**మాడుగుల (చీడికాడ), వార్తవళి సెప్టెంబరు 30 :** జిల్లా కలెక్టర్ వినయ్‌చందు బుదవారం సుడిగాలి చీడికాడ మండలంలో సుడిగాలి పర్యాటన చేశారు. మండలంలో జె వరహాపురం, జె కొత్తపల్లి, కోనాం గ్రామ పంచాయతీల్లో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ నిర్మాణంలో నాణ్యతతో పాటు అక్కడ పరిస్థితులను పరిశీలించారు.అయితే కలెక్టర్ పర్యాటన సమయంలో కోనాం గ్రామంలో సచివాలయ పరిస్థితి అస్థవ్యస్థంగా ఉందన్న అంశంపై, ముగ్గురు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. మీ పనితీరు మార్చుకోకపోతే సస్పెండ్ చెయ్యడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం కోనాం రిజర్వేయర్‌ని పరిశీలించిన ఆయన ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి రిజర్వేయర్‌లో నీటి నిల్వలు గురించి అడిగి తెలుసుకున్నారు. నీటి గరిష్ఠ స్థాయి పెరిగినప్పుడు ఎన్ని క్యూ సెక్కుల నీటిని వదులు తున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎన్ని పంటలకు సరిపడ రిజర్వేయర్ నుంచి రైతులకు సాగు నీరందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్కే బూడి ముత్యాలనాయుడు, ఎంపీడీవో జయప్రకాష్, తహసీల్దార్ అంబెద్కర్, వివిద శాఖలకు చెందిన అధికారులు పాల్గన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టర్ వినయ్‌చందుకి ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు.

**కోటపాడు పర్యాటన రద్ధు ..**

మాడుగుల మండలంలో ఎం కోటపాడు, జాలంపల్లి గ్రామాల్లో జిల్లా కలెక్టర్ వినయచందు పర్యాటన ఉందని మండల, గ్రామస్థాయి అధికారులు ఉదయం నుంచి మద్యాహ్నం వరకు వేచి చూశారు. అయితే చీడికాడ మండలం కోనాం పర్యాటన అనంతరం సమయం లేక మాడుగుల మండలంలో గల ఎం కోటపాడు, జాలంపల్లి గ్రామాల్లో కలెక్టర్ పర్యాటన రద్ధయినట్టు అధికారులకు తెలియడంతో, ఆయన పర్యాటన ఉందని 3గంటల వరకు వేచి ఉన్న అధికారులు వెను తిరిగారు. కాగా జిల్లా కలెక్టర్ చీడికాడ మండల పర్యాటన అనంతరం మాడుగుల పర్యాటన చేస్తారని తెలియడంతో పలు శాఖలకు చెందిన అధికారుల్లో మొదలయిన టెన్షన్, తీరా ఆయన పర్యాటన రద్ధయ్యిందని తెలిసి ఊపిరి పీల్చుకున్నారు.

## గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలి

### చోడవరం అటవీ కార్యాలయాన్ని ముట్టడించిన గిరిజనులు



**చోడవరం, సెప్టెంబర్ వార్తావళి 30:** గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ఏజన్సీని ఆనుకొని ఉన్న గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చవలసిందిగా సి.పి.ఎం. జిల్లా కార్యవర్గ సభ్యుడు డి.వెంకన్న డిమాండ్ చేసారు. వెంకన్న ఆధ్వర్యంలో కోనాం, వాలాబు, గర్సింగి గ్రామాలకు చెందిన గిరిపుత్రులు చోడవరం ఫారెస్టు రేంజి కార్యాలయాన్ని బుధవారం ముట్టడించారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం ప్రతీ గిరిజన కుటుంబానికి 10 ఎకరాల వరకు పట్టా ఇవ్వాలని చట్టం చేయబడిందని తెలిపారు. ఈ యేడాది అక్టోబరు 2న పోడు భూములకు పట్టాలు ఇచ్చేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఫారెస్టు భూముల్లో ప్లాంటేషన్లు ఉన్నాయంటూ అధికారులు కొర్రీలు వేయడంతో కొందరు గిరిపుత్రులు కొందరు ప్రభుత్వం అందజేసే పట్టాలు అందుకునేందుకు నోచుకోలేకపోతున్నారన్నారు. గిరిజనులకు భూమిపై హక్కులు కల్పిస్తే, అధికారుల పెత్తనం కుదరదనే ఉద్దేశ్యంతో అటవీ అధికారులు కొందరు ప్రభుత్వ పట్టాలు ఇచ్చేందుకు మోకాలడ్డుతున్నారన్నారు. అనంతరం చోడవరం ఫారెస్టు రేంజర్ బిర్లంగి రామ నరేష్‌కు ఆందోళనకారులు వినతి పత్రం సమర్పించారు. దీనిపై ఫారెస్టు రేంజర్ రామ నరేష్ ఆందోళనకారులతో మాట్లాడుతూ ఫారెస్టు అధికారులను పంపి, మరల దర్యాప్తు చేస్తామని చెప్పడంతో వారు శాంతించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా కార్యదర్శి ఈ.నర్సింహమూర్తి, జిల్లా కార్యదర్శి సి.హెచ్.రాజు, చీడికాడ మండల సి.ఐ.టి.యు కార్యదర్శి రొంగలి దేముడునాయుడు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీల విజేతలు వీరే

**విజయనగరం, సెప్టెంబర్ వార్తావళి 30:** ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి, ప్రకృతి వ్యవసాయ రచయితల సంఘం(నవ)ల సహకారంతో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల విజేతలను సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి సముద్రాల గురుప్రసాద్ బుధవారం ఉదయం ఒక ప్రకటనలో విడుదల చేసారు. వ్యాస రచన పోటీలో ప్రథమస్థానాన్ని నరసాపురపు పేటకు చెందిన వానపల్లి లక్ష్మీజ్యోత్స్న, ద్వితీయ స్థానాన్ని రాయచోటికి చెందిన కె.విష్ణువర్ధన్, తృతీయ స్థానాన్ని సంయుక్తంగా విజయ నగరంకు చెందిన డి.మేఘన, కవిటికి చెందిన బి.దేవిక సాధించారని తెలిపారు. కవితల పోటీల్లో ప్రథమస్థానాన్ని చీరాలకు చెందిన వడలి రాధాకృష్ణ, ద్వితీయ స్థానాన్ని విజయవాడకు చెందిన మోహనకృష్ణశాంతి, తృతీయ స్థానాన్ని కరీంనగర్‌కు చెందిన నామని సుజనాదేవి సాధించారని ప్రకటనలో పొందుపరచారు.




## గ్రోయిన్ గండి పూడ్చివేతకు రైతుల శ్రమదానం



**బుచ్చయ్యపేట, వార్తావళి, సెప్టెంబర్ 30 :** ఇటీవల వరద ఉధృతికి కొట్టుకుపోయిన వడ్డాది కస్పా గ్రోయిన్ గండి పూడ్చివేతకు రైతులు నడుంబిగించారు.ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ సమస్యను తామే పరిష్కరించు కోవడానికి స్వచ్ఛందంగా తరలి వచ్చారు.ఆయకట్టు రైతులు తలో కొంత విరాళాలు సేకరించి గండి పూడ్చివేతకు రెండు రోజుల నుండి శ్రమదానం చేస్తున్నారు.పెద్ద పెద్ద బండరాళ్ళు,తాటి చెట్టు దుంగలు, ఇసుకబస్తాలు అడ్డంగా వేసి గండిని పూడ్చుతున్నారు.వడ్డాది కస్పా గ్రోయిన్ పై ఆధారపడి 4 గ్రామాలకి చెందిన 1600 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఖరీఫ్లో రైతులందరూ పెట్టుబడి పెట్టి సాగు ప్రారంభించారు. గ్రోయిన్ కి గండి కొట్టడంతో నీరంతా పెద్దేరు నదిలోకి వృధాగా పోతుంది. చుక్క నీరు కూడా కస్పా కాలువలోకి రాలేదు.రైతులు సమస్యను ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళినా ఫలితం లేదు.వారు వచ్చి పరిశీలించి వెళ్లారే తప్ప తాత్కాలికంగా కూడా పనులు చేపట్టలేదు.చేసేదిలేక తమ పంటలను కాపాడుకోవడానికి రైతులే ముందుకు వచ్చారు.తాత్కాలికంగా గండిని పూడ్చుతున్నారు. సుమారు 200 మంది రైతులు శ్రమదానం చేస్తున్నారు.

## వైఎస్సార్ వ్యవసాయ ఉచిత విద్యుత్ పథకం గోడపత్రిక ఆవిష్కరణ

**నర్సీపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** వైయ స్సార్ వ్యవసాయ ఉచిత విద్యుత్ పథకం అమలు చేయ డంలో భాగంగా వ్యవ సాయ వినియోగదారులకు అవగాహన కల్పించడంకోసం నిర్దేశించిన గోడపత్రికలను, కరపత్రాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ పథకం పగటి పూట రైతులకు నాణ్యమైన 9 గంటల విద్యుత్ సరఫరా చేయడానికి ఉద్దేశించబడిందన్నారు. ఈ పథకం ద్వారా వ్యవసాయ వినియోగదారులకు మీటర్లు ఏర్పాటు చేసి వినియోగాన్ని లెక్కించి వినియోగానికి అయ్యే బిల్లును రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తుందన్నారు. తద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలకు బదిలీ చేయబడుతుందన్నారు. ప్రతీ వ్యవసాయ వినియోగదారుడు ప్రభుత్వం నుండి ఎంత మేర లబ్ధిపొందుతున్నారో తెలుసుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. నాణ్యమైన 9 గంటల సరఫరా జరుగుతుందో లేదో తెలుసు కోవడానికి వీలౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆపరేషన్ జి.సురేష్బాబు, నర్సీపట్నం టౌన్ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఈ.మోహన్, నర్సీపట్నం రూరల్ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.లక్ష్మణరావు, నర్సీపట్నం టౌన్ అసిస్టెంట్ ఇంజనీర్ పి.పరమేశ్వరరావు, నర్సీపట్నం టౌన్ విద్యుత్ సిబ్బంది, వైసిపి నాయకులు సుర్ల గిరిబాబు, లెక్కల సత్యనారాయణ, రుత్తల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## దళితులపై దాడులను అరికట్టాలని బైక్ ర్యాలీ

**నర్సీపట్నం రూరల్, వార్తావళి, సెప్టెంబర్ 30 :** దళితులపై జరుగుతున్న దాడులను అరి కట్టాలని డిమాండ్ చేస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో నర్సీపట్నం మండలం పెదబడ్డే పల్లి, గొలుగొండ మండలం ఎల్లవరం, గుండుపాల తదితర గ్రామాల్లో ర్యాలీ, బైక్ ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ విశాఖజిల్లాలో ఈ మధ్యకాలంలో రావికమతం మండలం గుమ్మాళ్లపాడులో 28 కుటుంబాలు బహిష్క రించడం జరిగిందన్నారు. కులాంతర వివా హం చేసుకున్నందుకు అలా చేశారని, ఇది సరైంది కాదన్నారు. అలాగే పెందుర్తి మండలం సీతానగర్లో శ్రీకాంత్ అనే దళిత యువకుడిని శిరోముండనం ఘటన, నర్సీపట్నం మత్తు డాక్టర్ సుధాకర్ను మాస్క్ లు లేవని ప్రశ్నించినందుకు సస్పెండ్ చేయడం వంటివి దుర్మార్గమన్నారు. మాడు గుల మండలం కోటపాడు గ్రామంలో దళితు లకు స్మశానం స్థలం ఆక్రమిం చుకోవడం వంటి సంఘటనలు జరిగాయని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్లో 18 ఏళ్ల దళిత మహిళలపై అత్యాచారం చేసిన దుం డగులను కఠినంగా శిక్షించాలన్నారు. ఎన్ని రాజకీయ పార్టీలు మారినా దళితులపై దాడు లు పెరుగుతున్నాయన్నారు. ప్రభు త్వా నికి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ, ఎస్టీ కమిషన్ నియమించాలని, దళితులపై జరుగుతున్న దాడు లను అరికట్టాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ కార్పొరేషన్ రుణాలు విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, డప్పు కళాకారులకు, చర్మకా రు లకు పింఛన్లు తక్షణమే విడుదల చేయా లని కోరారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయ కులు లావరాజు, అర్జున్, రాము, సిఐటియు డివిజన్ నాయకులు శివ పాల్గొన్నారు.

### దొంగలకు దోపిడీదారులకు సహకరించడం మాని మంచి పనులు చేయాలి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం రూరల్, వార్తావళి, సెప్టెంబర్ 30 :** విజయసాయిరెడ్డి దొంగ లకు, దోపిడీ దారులకు సహకరించడం మాని మంచి పనులు చేయాలని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్బ్యూరో సభ్యులు చింతకా యల అయ్యన్నపాత్రుడు ఆరోపిం చారు. మంగళవారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు కుటుంబ సభ్యుల గురించి మాట్లాడటానికి మీకు ఏ మాత్రం అర్హత లేదన్నారు. భారతీయ జనతా పార్టీ నాయకురాలు పురందేశ్వరి గురించి మీరు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

## రైతు బిల్లు రైతులకు లాభం

**మాకవరపాలెం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** కేంద్ర తీసు కున్న రైతు బిల్లుతో రైతులకు మేలు చేకూ రు తుందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పివిఎస్.మాధవ్ అన్నారు. మాకవరపాలెం మండలం భారతీయ జనతా పార్టీ మండల సర్వసభ్య సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు గవిరెడ్డి రఘుచక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాధవ్ కేంద్రం తీసుకున్న రైతు బిల్లు గురించి వివరించారు. అదేవిధంగారాష్ట్రంలో కార్యకర్తలు పార్టీ బలోపేతం చేయాల్సిన అవవ్యతక ఉందన్నారు. జి.కోడూరు గ్రామానికి చెందిన చవాకులు కళ్యాణ్కి, తమ్మియ్యపాలెం గ్రామానికి చెందిన పైల నారాయణమూర్తి అనే రైతులకు సన్మానం కూడా చేయడం జరిగింది. అదేవిధంగా బయ్యవరం గ్రామానికి చెందిన గంగబాబు మరికొందరిని ఎమ్మెల్సీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు కొండబాబు, కర్రి రామకృష్ణ, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాదె శ్రీనివాసరావు, నర్సీపట్నం అసెంబ్లీ కన్వీనర్ కాళ్ల సుబ్బారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ సీజ్

**కశింకోట వార్తావళి, సెప్టెంబర్ 30 :** అనకాపల్లి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో ఇసుక అక్రమ రవాణా వ్యాపారులు పై దాడు లు చేపడుతున్నారు. మార్కెట్ లో ఇసుక దొరకని పరిస్థితి ఉండ టంతో ఇసుక అక్రమ వ్యాపారులు కోట్లకు పడగలెత్తు తున్నారు. మంగళవారం మండలంలో జమ్మదులపాలెం గెడ్డ నుండి అక్ర మంగా ఇసుకను తవ్వి ట్రాక్టర్ లో బయ్యవరం గ్రామానికి తరలి స్తుండగా పట్టుకున్నారు.నాలుగు టన్నుల ఇసుక తో పాటు ట్రా క్టరును సీజ్ చేసి, ట్రాక్టర్ డ్రైవర్ కోటీని, రాజును అదుపులోకి తీసు కొని అరెస్ట్ చేయడం జరిగింది అని అనకాపల్లి స్పెషల్ ఎన్ఫోర్స్మెం ట్ బ్యూరో ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది ఎస్సై అనిల్ కుమార్, కానిస్టేబుల్స్ శ్రీను, నాయుడు బాబు పాల్గొన్నారు.

## ఎంఎల్సి బుద్ధనాగ జగదీశ్వరరావుని సత్కరించిన దళిత తేజం



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 30 :** బుద్ధ నాగజగదీశ్వరరావు గార్ని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు గౌరవ మాజీ ముఖ్యమంత్రివర్యులు శ్రీ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు, అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులుగా నియమించినందుకు అనకాపల్లి దళిత తేజం నియోజకవర్గం ఇన్ ఛార్జ్ సబ్బవరపు గణేష్ గారి ఆధ్వర్యంలో శ్రీ బుద్ధ నాగ జగదీశ్వరరావు గార్ని సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో, గిలకల అప్పారావు, గొర్లి సుబ్బారావు, పోతల శ్రీనివాసరావు, బండి అప్పారావు, బెల్లాన శివాజీ, నేతల రాము, బెల్లాన శ్రీనివాసరావు, మాదల విజయ్, ఇందుగబిల్లి వేణు, గంట్యాడ రమణ, ముత్యాల బ్రహ్మం, మరియు టీడీపీ నాయకులు కార్యకర్తలు.

## సచివాలయ సేవలపై అవగాహనకు శిక్షణ తరగతులు

**సబ్బవరం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** రాష్ట్ర ప్రభుత్వ మానస ఆయన సచివాలయ వ్యవస్థ పై మరింత పట్టు సాధించేందుకు సిబ్బందికి శిక్షణ లాంటి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని సబ్బవరం మండల అభివృద్ధి అధికారి కె. రమేష్ నాయుడు అన్నారు. బుధ వారం ఉదయం స్థానిక మండల పర్షిత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సిబ్బంది అవగాహన తరగతులు ప్రారంభించారు. మొత్తం మండలం లోని ఉన్న ఇరవై సచివాలయంలో ఉన్న142 ఉద్యోగులకు వారం రోజులు దఫాలుగా తరగతులు నిర్వహిస్తున్నా మని అన్నారు. బుధవారం పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ ఉద్యాన శాఖ, వారికి తరగతులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీ డీఓ, రమేష్ నాయుడు మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ ఏర్పడి సుమారుగా ఒక సంవత్సరం కావస్తోంది అని, ఇంకా చాలా మందికి సచివాలయంలో అందిస్తున్న సేవలు పూర్తిగా తెలుసుకోవాలి సూచించారు. ఈ మధ్య జిల్లా కలెక్టర్ మండలంలోని పర్యటన సందర్భంగా సచివాలయంలో సిబ్బంది తో ముఖాముఖి సమావేశంలో అందుతున్న సేవలపై అరా తీయుగా సబ్బవరం మండలం వెనుక బడిన విషయాన్ని ఆయన నాతో చెప్పారని అన్నారు. తరగతులు అనంతరం తాను అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఉన్న వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీఓ, రమేష్ నాయుడుతో పాటు, వ్యవసాయ అధికారి పి. సత్యనారాయణ, గుల్లెపల్లి పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సౌజన్య, పరిపాలన అధికారి బాబూరావు, ఈ. ఓ.పి.ఆర్. డి. పంచాయతీ కార్యదర్శి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు భవన్ నిర్వాహకుడు పీఎంఎల్ నరసింహం

**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 30 :** పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయం దరి మెయిన్రోడ్డుపై ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద గురువారం ఉదయం 10గంటలకు ఆంధ్రరాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు అమరజీవి పొట్టి శ్రీరాములు భవన నిర్మాణ నిర్వాహకుడు పీఎంఎల్ నరసింహం (మూర్తి) పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేసారు. ఈ వేడుకల్లో భాగంగా గాన గంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం మృతికి నివాళులు అర్పించే కార్యక్రమం ఉంటుందన్నారు. కాగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసీపీ పట్టణశాఖ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు,(జానీ), యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొగ్గారపు పద్మరాజు విచ్చేయనున్నట్లు తెలిపారు. కాగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## డాక్టర్ శ్యామల మృతిపై సమగ్ర దర్యాప్తు జిల్లా ఎస్పీ... బొడ్డపల్లి కృష్ణారావు

**కశింకోట వార్తావళి, సెప్టెంబర్ 30 :** ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టులు ప్రాబల్యం తగ్గిందని జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. మం గళవారం రాత్రి స్థానిక పోలీసుస్టేషన్ ను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అభివృద్ధినీ మావోయిస్టులు అడ్డుకుంటున్నారని గిరిజనులు గమనిం చారన్నారు, అక్కడ ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకుంటున్నారని చెప్పారు. డాక్టర్ శ్యామల మృతి పై సమగ్ర దర్యాప్తు జరిపిస్తున్నామని,మృతి పట్ల అనుమానాలు ఏమిలేవు అన్నారు. అయినప్పటికీ అన్నికోణాల నుండి దర్యాప్తు జరుగు తుంది అన్నారు.రోడ్డు ప్రమాదాలు నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామని అన్నారు. ఎస్పీ సమావేశం లో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ త్రినాద్,రూరల్ సీఐ నర్సింగరావు వున్నారు.

## ఏఎల్పురంలో సమస్యలు పరిష్కరించాలి

**కేడిపేట, వార్తావళి, సెప్టెంబర్ 30 :** ఏఎల్పురంలో సమస్యలపై అధికా రులు నిర్లక్ష్యం చూపడం తగదని అక్కడి వారు వాపోతున్నారు. పలు వీధుల్లో పైప్లైన్ల లీకేజీ కారణంగా తాగునీరు వృధాగా పోతోందన్నారు. దీంతో అరకొర నీటితో ఇబ్బందులు ఎదుర్కొం టున్నట్లు చెప్పారు. వీధి దీపాలు వెలగకపోవడంతో బిసి కాలనీ, పిహెచ్సి తదితర శివారు వీధుల్లో అంధకారం అలముకుంటోందని పేర్కొంటున్నారు.

## టీడీపీ మద్యనిషేధంపై మాట్లాడటం విడ్డూరం

### వైసీపీ యువజన అధ్యక్షుడు జాజుల రమేష్ ఎద్దేవా



**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 30 :** మద్యంపై బుద్ధ నాగ జగదీష్ గారు మాట్లాడటం విడ్డూరంగా ఉందనీ, గుడీ బడీ అని తేడాలేకుండా విచ్చలవిడిగా మద్యాన్ని ఏరులై పారించి ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడిన మీరు ఈ రోజు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందనీ. రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి గారు దఫదఫాలుగా మద్యపాన నిషేధం చేస్తాను అని చెప్పి పాదయాత్ర లో ఇచ్చిన మాట ప్రకారం మీ పాలన లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలను తెలుగు తమ్ముళ్ళు వీదివీదికో ఒకటి నడుపుతున్న వాటిని కట్టడి చేసి పేదల కష్టాన్ని దోచుకోవడాన్ని అరికట్టింది మీకు కనబడలేదా. సంవత్సరానికి 20%వైన్ షాపులను తొలగిస్తూన్నది అప్పటిలో మీరున్నప్పుడు ఎన్ని దుకాణాలు ఉన్నాయి ఇప్పుడు ఎన్నిఉన్నాయో కళ్లు తెరిచిచూడాలనీ. పాదయాత్ర లో మద్యం ముట్టుకుంటే షాక్ కొట్టేలా చేస్తాను అని చెప్పి ఆ మాట ప్రకారం ప్రభుత్వమే షాపులను నడుపుతూ సమయం ఉదయం11గం,,నుండి రాత్రి 8గం,, వరకూ మాత్రమే అమ్మేలా పెట్టి అర్ధరాత్రులు కూడా మీలా అమ్మకాలు లేకుండా చేయడం మీకు కనబడలేదా. మీకు ఆదాయం తప్పా ప్రజల ప్రాణాలను కూడా చూడకుండా మీరు చేసిన మద్యాంధ్ర ప్రదేశ్ వలన ఎంతమంది ప్రాణాలు ప్రమాదాలలో కోల్పోయారో మీకు తెలియకపోతే అదికారులను అడిగితే తెలుస్తుందనీ. మీరు ఆడపడుచుల నుదుటున బొట్టును మీ ఆదాయం కోసం తుడిచి వేస్తే, పసుపు కుంకుమ అని మల్లా ఆడపడుచులను మోసం చేయడానికి మీకు వాతలు పెట్టి ఉప్పుకారం పెట్టి మూలన కూర్చోబెట్టినా ఇంకా మీకు సిగ్గురాలేదా. జగన్మోహన్ రెడ్డి పేదవాడి కష్టార్జితం తన బార్య బిడ్డలకూ చెందాలనీ మద్యానకి దూరంగా ఉంచాలనీ చేస్తున్న ప్రయత్నాలకు సపోర్ట్ చేయకపోయినా పర్వాలేదు కానీ నీచ రాజకీయాలు మాత్రం చేయకండనీ ,ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఇచ్చిన హామీలను సంవత్సరకాలంలోనే ఎన్ని కష్టాలు ఎదురైన 90% నెరవేర్చిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అనీ, మీరు ఇచ్చిన హామీలు ఐదు సంవత్సరాలలో చేయకపోగా ఎన్ని హామీలు నెరవేర్చారో తెలియనీ మీరు మమ్మల్ని విమర్శించడం చాలా విడ్డూరంగా ఉందనీ, చవకబారు రాజకీయాలు మానుకోపోతే రానున్న రోజుల్లో మిమ్మల్ని ప్రజలు ఇంకా పాతాళంలో కి పాతేస్తారనీ యువజన అధ్యక్షుడు జాజుల రమేష్ హెచ్చరించడం జరిగింది.

## పేదరైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే అమర్నాథ్

**అనకాపల్లి, వార్తావళి, సెప్టెంబర్ 30 :** రాష్ట్రంలో సన్న, చిన్నకారు రైతులను ఆదుకోవటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా వైఎస్ఆర్ జలకళ పథకానికి శ్రీకారం చు ట్టారని ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. మండలం లోని కొత్తూరు పంచాయితీ కార్యాలయం వద్ద బుధవారం ఆయన వైఎస్ఆర్ జలకళ వాహనాన్ని ఆయన స్వంతంగా నడిపి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమర్ మాట్లాడుతూ పేద రైతుల సంక్షేమమే వైఎస్సార్సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతాంగం పడుతున్న కష్టాలను తొలగించి వారి కళ్లల్లో వెలుగులు నింపాలన్న సదాశయంతో రైతన్నలకు ఆర్ధికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం వైఎస్ఆర్ జలకళ పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఏపీలో పంట సాగుకు వీలయ్యే ప్రతీ ఎకరాకు నీరు అందించాలన్నదే ప్రభు త్వ ఆశయమన్నారు. దీనిలో భాగంగా రాష్ట్రంలోని అన్ని నియోజ కవర్గాల్లో దాదాపు 2లక్షల బోర్లు తవ్వించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని చెప్పారు. మెట్ట ప్రాంత రైతులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. చిన్న, సన్నకారు రైతులకు బోర్లు త వ్వించటమే గాకుండా మోటార్లు కూడా ఉచితంగా బిగించి ఇస్తున్న ట్లు వెల్లడించారు. నీటి సదుపాయం లేని రైతన్నలకు ఈ పథకం అండగా నిలుస్తుందని తెలిపారు. ప్రతీ రైతు ఈ పథకాన్ని సద్వినియో గం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ రైతులు ఆన్లైన్ ద్వారా గానీ, వార్డు వాలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది సహకారంతో ధరఖాస్తు చేసుకుంటే అర్హులైన ప్రతీ రైతుకు ప్రభు త్వం ఈ పథకం కింద బోర్లు తవ్వించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండలశాఖ అధ్యక్షుడు గొర్లి సూరిబాబు, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మండలశాఖ ప్రధాన కార్య దర్శి భీశెట్టి జగన్, వైసీపీ నేతలు దంతులూరి శ్రీదర్రాజు, మలసాల కిశోర్, ఏపీడీ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా సిపిఐ, సిపిఎం నిరసన దీక్షలు


**నర్సీపట్నం టౌన్, వార్తావళి, సెప్టెంబర్ 30 :** సిపిఐ, సిపిఎం వామపక్షాల ఆద్వర్యంలో రైతు సంఘాలు ఆధ్వర్యంలో రైతాంగ వ్యవసాయ బిల్లుల వ్యతిరేక విధానాలను ఖండిస్తూ నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాకిరెడ్డి రామునాయుడు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.సత్తిబాబు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మూడు రైతు వ్యతిరేక చట్టాలను దేశ రైతాంగానికి ఉరితాళ్లుగా మారాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట వేసే విధంగా ఉందన్నారు. రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశంలో అనేక రాష్ట్రాలు, రైతు సంఘాల నిరసనలు, ఆందోళనలు చేస్తున్న సందర్భంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్మోహన్రెడ్డి, ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబునాయుడు కేంద్ర ప్రభుత్వ విధానాలపై కనీస స్పందన లేకపోవడం చాలా బాధాకరమన్నారు. రైతులపై వీరి యొక్క ప్రేమ ఏ విధంగా ఉందో అర్ధమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, సిపిఐ కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, ఐద్వా నాయకులు ఎల్.గౌరి, శ్రీనివాస్చౌదరి, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, సూర్యప్రభ పాల్గొన్నారు.


## అక్టోబర్ 2 మద్యపాన నిషేధ ర్యాలీని విజయవంతం చేయండి

**పిఠాపురం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** పిఠాపురంలో మద్యంలేని వ్యవస్థని నెలకొల్పాలని సారా లేని సమాజంగా తీర్చిదిద్దాలని ముఖ్య ఉద్దేశంతో మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యా లయం వద్ద గాంధీ జయంతి అక్టోబర్ 2వ తేదీన నిర్వహించబోయే ర్యాలీ కార్యక్ర మానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరిం చడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ సూర్య నారాయణ మాట్లాడుతూ ఆనాడు గాంధీ కూడా మద్య నిషేదానికి చాలా పాటుపడ్డారని ఆ సూక్తిని పాటిస్తూ, ఈనాడు కూడా పాలకులు మద్యాన్ని నిషే ధించే పాలించాలి.కానీ మద్యంతో వచ్చిన డబ్బుతోనే ఈనాడుపాలనా విధానాన్ని సాగిస్తు న్నారని మద్యాన్ని అరికట్టలేని ప్రభు త్వాలు పాలించడానికి అర్హులు కాదని అన్నారు.కరోనా విస్తరిస్తున్న టైంలో 40 రోజుల పాటు షాపులు తీయ నప్పుడు జనాలు మద్యాన్ని మర్చిపోయారని,మరలా కావాలని ఆదాయం కోసం ప్రభుత్వమే మరల మద్యం షాపు తెరిపించిదని అన్నారు. అదేవిధంగా గ్రామాల్లో సారాన్ని అరి కట్టడంలో అధికారులు విఫలమ వుతున్నా రని అధికారులు దృష్టి పెడితే నిషేధించడం చాలా సులభమని కానీ ఆ దిశగా అధికా రులు ప్రయత్నాలు చేయలే దని అన్నారు. గాంధీ జయంతి రోజు అక్టోబర్ 2 తారీకున జరిగే మద్య పాన వ్యతిరేక ప్రచార కమిటీ నిర్వహించే ర్యాలీలో మహిళలు యువకు లు ప్రజా సంఘాలు అన్ని పార్టీలవారు పాల్గోవాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక పిఠాపురం యూనిట్ అధ్య క్షులు వి.ఎస్.రెడ్డి, మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ నియోజకవర్గ సభ్యులు టి.కరు ణ్ రాజు కరణం విశ్వనాధ్, సాకా రామకృష్ణ, కూరాకుల సింహాచలం, కేశవరపు అప్పల రాజు, డి.సాల్మన్ రాజు కొంగు నూకరాజు తదితరులు పాల్గొన్నారు

## మన్ననలు పొందడంతో మాధవికి గుర్తింపు

**కొయ్యూరు, వార్తావళి, సెప్టెంబర్ 30 :** చిన్న వయసులోనే పార్లమెంటు సభ్యు రా లుగా లోక్సభలో అడుగు పెట్టిన అరకు పార్లమెంటు సభ్యురాలైన గొట్టేటి మాధవికి అత్యున్నత స్థానం దక్కింది. కేంద్ర ప్రభుత్వం నియమిం చిన విదేశీ వ్యవహారాల కమిటీ లో సభ్యురాలుగా మాధవి కి స్థానం కల్పించారు. 31 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ లోక్సభ నుండి21మంది,10మంది రాజ్యసభ నుండి కమిటీ సభ్యులుగా నియమించగా చైర్ పర్సన్ గా పి.పి చౌదరి వ్యవహరించనున్నట్టు ఎంపి మాధవి క్యాంప్ కార్యాలయం నుండి ఒక ప్రకటన ద్వారా వివరించారు. రాష్ట్రం నుండి అర్హత కలిగిన 21 మంది సభ్యులకు అవకాశం ఉన్నప్పటికీ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించి ప్రజల మన్ననలు పొందడంతో మాధవికి ఈగుర్తింపు పొందినట్టు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై మాధవి మాట్లాడుతూ నన్ను గుర్తించి మరింత బాధ్యత ఇచ్చి నందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి,మిధున్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియ చేసినట్లు తెలిపారు.శక్తి వంచన లేకుండా పార్లమెంటులో తమ పరిధిలో ఉన్న సమస్యలపై గళంవిప్పి సాధిస్తానని మాధవి స్పష్టం చేసారు.





# విశాఖపట్నం వార్తలు

## విశాఖలో గాన గంధర్వ బాలు విగ్రహం, ఆడిటోరియం ఏర్పాటు చేయాలి - చెరువు రామకోటయ్య




సినీ వినీలాకాశంలో ఒక వెలుగు వెలిగిన ధ్రువతార ఎస్పీ బాలసుబ్రమణ్యం మృతి ఎవరూ జీర్ణించుకోలేనిదని భారతీయ జనతా పార్టీ నాయకులు చెరువు రామకోటయ్య అన్నారు. తన గానంతో కళామతల్లికి సుగంధాలు అద్ది, గమకాల సుమమాల లు వేసిన మమతానురాగాల మహనీయుడు. తెలుగు భాషకు పట్టం కట్టిన సంగీత శిఖరం బాలు అని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు వారికి తరగని సంపద అందించిన బాలు వారసత్వాన్ని ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బాలు అభిమానులంతా సంఘటితం కావలసిన ఆవశ్యకత ఉందని తెలిపారు. బాలు అందించిన సినీ, సంగీత, భాషా సంపదలను నేటి తరానికి సులభంగా అందుబాటులో ఉంచే విధానాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని తెలియజేసారు. విశాఖపట్నం అంటే బాలసుబ్రమణ్యం గారికి అత్యంత ఇష్టమని, అందుకే ఎవరు పిలిచినా వేంటనే వచ్చేవారని, విశాఖను ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక రాజధానిగా ఆయన పేర్కొన్న సందర్భాలు అనేకమని రామకోటయ్య చెప్పారు. అందుకే ఆయన విగ్రహాన్ని విశాఖలో ఏర్పాటు చేయడం సముచితమైన నిర్ణయం అవుతుందని, ఆయన పేరిట ఒక ఆడిటోరియం నిర్మించి అందులో ఆయన పాటలు, టీవీ కార్యక్రమాల వీడియోలు మొదలైనవన్నీ భద్రపరిస్తే భవిష్యత్ తరాలకి మేలు చేసిన వారం అవుతామని అన్నారు. ఆడిటోరియం లో నిత్యం కార్యక్రమాలు జరిగేలా చూడాలని, ఇందుకుగాను ఎస్పీ బాలసుబ్రమణ్యం అభిమానిలంతా సమావేశమై ఒక నిర్మాణాత్మక ప్రణాళికను రూపొందించాలని, కార్యాచణ ను అమలుపరిచేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని సూసించారు. బాలు అందించిన సినీ, సంగీత, భాషా సంపదలను కాపాడుకొంటూ భవిష్యత్ తరాలకు అందించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.

## 60వ వార్డులో సచివాలయ సేవలు

**మల్కాపురం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** 60వ వార్డులో సచివాలయంలో కొన్ని సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చేంది ప్రజలు కొందరు కొన్ని సేవలకు దరఖాస్తు చేరుకోగా బుధవారం సేవలు ప్రారంభం కాగా ముఖ్య అతిథిగా పి.వి.సురేష్ పాల్గొని ఓ మహిళకు ఇన్ కామ్ సర్టిఫికెట్ ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో వార్డ్ వైస్సార్ సీపీ నాయకులు పుర్రె సురేష్ యాదవ్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రరాష్ట్ర అవతరణ వేడుకలు విజయవంతం చేయండి

## ఎఫ్‌టీటీఐ అధిపతిగా శేఖర్ గుప్తా నియామకం




**పుణె:** మహారాష్ట్రలోని పుణెలో గల ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌సిట్యూట్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టీఐఐ) అధ్యక్షుడిగా ప్రముఖ చిత్ర నిర్మాత, దర్శకుడు శేఖర్‌కపూర్ మంగళవారం నియమితులయ్యారు. కేంద్ర సమాచార, ప్రసారాల మంత్రిత్వశాఖ ఈ మేరకు శేఖర్ కపూర్‌ను ఎఫ్‌టీఐఐ అధ్యక్షుడిగా నియమించిందని సంస్థ డైరెక్టర్ భూపేంద్ర కైంథోలా తెలిపారు. శేఖర్ కపూర్ పదవీ కాలం 2023 మార్చి 3 వరకు ఉంటుంది.

## యూపీలో 'నిర్భయ'




**న్యూఢిల్లీ/హాథ్రస్:** నిర్భయ ఘటనను తలపించే మరో దారుణం ఉత్తరప్రదేశ్‌లో చోటు చేసుకుంది. 19 ఏళ్ల దళిత యువతిని నలుగురు అగ్రవర్ణ యువకులు అత్యంత దారుణంగా గాయపర్చి, పాశవికంగా సామూహిక అత్యాచారం చేశారు. ఆ యువతి చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున ఢిల్లీలోని సఫ్దర్ జంగ్ ఆసుపత్రిలో చనిపోయింది. తెగిన నాలుక, విరిగిన ఎముకలు, పూర్తిగా చచ్చుపడిపోయిన కాళ్లు, పాక్షికంగా పక్షవాతానికి గురైన చేతులు, మెడకు, వెన్నెముకకు అయిన తీవ్ర గాయాలు.. ఆ యువతిపై ఆ రాక్షసులు సాగించిన దమనకాండకు సాక్ష్యాలుగా నిలిచాయి. దేశవ్యాప్తంగా నిరసనలకు, నిర్భయ చట్టానికి కారణమైన 8 ఏళ్ల క్రితం నాటి నిర్భయ అత్యాచార ఘటనను ఈ దారుణం గుర్తుకు తెచ్చింది. దళిత యువతి మృతిపై పౌర సమాజ కార్యకర్తలు, దళిత సంఘాలు, భీమ్ ఆర్మీ, కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీ తదితర పార్టీలు తీవ్రంగా మండిపడ్డాయి. యూపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించాయి. ఢిల్లీలోని సఫ్దర్ జంగ్ ఆసుపత్రి వెలుపల భీమ్ ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో వేలాది మంది ధర్నాకు దిగారు. ఆ దళిత యువతికి న్యాయం చేయాలని, దోషులను బహిరంగంగా ఉరి తీయాలని నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా దళితులంతా వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని ఆజాద్ పిలుపునిచ్చారు. ఆటవిక రాజ్యం నడుస్తున్న యూపీలో మరో దళిత యువతి బలి అయిందని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు.

## హైదరాబాదులో వాట్సాప్ హ్యాకర్లు



సోషల్ మీడియాలో అగ్రగామి అయిన వాట్సాప్‌పై సైబర్ నేరగాళ్లు పడ్డారు. ఇతరుల ఫోన్ నంబర్లతో తమ ఫోన్లలో వాట్సాప్‌ను యాక్టివేట్ చేసుకొని వాటి ద్వారా ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారు. ఈ తరహా సైబర్ ఎటాక్‌లో భాగంగానే మంగళవారం ఒక్కరోజే హైదరాబాద్‌లో వందలాది మందికి చెందిన వాట్సాప్‌లు క్రాష్ అయ్యాయి. వారిలో కొందరు సెలబ్రెటీలు సైతం ఉన్నారు. ఈ వ్యవహారంపై సైబర్ క్రైం పోలీసులు ఆరా తీస్తున్నారు. వివిధ రకాలైన సైబర్ క్రిమినల్స్ బాధితులకు కనిపించరు. కేవలం కాల్స్, సందేశాలతో ఎరవేసి, అందినకాడికి దండుకుంటూ ఉంటారు. దీనికోసం ఒకప్పుడు ఈ సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్, ఎస్సెమ్మెస్‌లు ఉపయోగించే వారు. అయితే ఇలా చేయడం వల్ల పోలీసులు ఫోన్ నంబర్ ఆధారంగా పట్టుకొనే అవకాశం ఉండటంతో ఇటీవల కాలంలో సైబర్ నేర గాళ్లు యాప్స్ వినియోగిస్తున్నారు. వాటితోనే కాల్స్ చేస్తున్నారు. ఇందుకోసం ఎక్కువ మం ది వాడే వాట్సాప్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. ఈ యాప్ 'ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రి ప్టెడ్' కావడంతో సైబర్ నేరగాళ్లతోపాటు ఉగ్రవాదులూ వినియోగిస్తున్నారు. ఇటీవల కాలంలో స్మార్ట్‌ఫోన్ల వినియోగం పెరిగింది. దీంతో సైబర్ నేరగాళ్లు తాజాగా వాట్సాప్ టేకోవర్ స్కామ్స్ మొదలెట్టారు. సైబర్ క్రిమినల్స్ తమ ఫోన్‌లో వాట్సాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నాక ఏదో ఒక సిరీస్ నుంచి ఓ ఫోన్ నంబర్‌ను వెరిఫికేషన్ కోసం ఎంటర్ చేస్తున్నారు. దీంతో వెరిఫికేషన్ కోడ్ ఆ నెంబర్‌కు వెళ్లిపోతోంది. ఆ వెంటనే నేరగాళ్లు ఆ నంబర్ గల వారికి 'ఓ కోడ్ పొరపాటున మీ ఫోన్‌కు పంపాను. దయచేసి నాకు తిరిగి పంపండి' అంటూ ఫోన్ లేదా సందేశం ద్వారా అడుగుతున్నారు. ఆరు డిజిట్స్‌తో ఉండే ఈ వెరిఫికేషన్ కోడ్‌ను అందుకున్న వ్యక్తి సైబర్ నేరగాడికి చెప్పిన వెంటనే... అతడి వాట్సాప్ ఖాతా సైబర్ నేరగాడి ఫోన్‌లోకి మారిపోతుంది. ఆ వెంటనే అసలు వ్యక్తి ఫోన్‌లోని వాట్సాప్ క్రాష్ అయిపోతుంది. ఒకసారి వాట్సాప్ క్రాష్ అయితే ఆ ఖాతాలోని డేటాను కోల్పోతారు. ఈ తరహా మోసాల బారినపడకుండా ఉండాలంటే ఫోన్లకు వచ్చే వెరిఫికేషన్ కోడ్స్‌ను ఎవరికీ పంపకూడదు, చెప్పకూడదని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## ముఖేష్ అంబానీ సంపాదన గంటకు రూ. 90 కోట్లు



అపర కుబేరుడు, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ సంపాదన గంటకు రూ. 90 కోట్లు. ఐఐఎఫ్ఎల్ వెల్త్ హురూన్ ఇండియా రిచ్ లిస్ట్ 2020 జాబితాలో ఆయన వరుసగా తొమ్మిదవ సారి అగ్రస్థానంలో నిలిచారు. ఆయన సంపద రూ.2.77 లక్షల కోట్ల నుండి రూ. 6.58 లక్షల కోట్లకు పెరిగిన నేపథ్యంలో ఆయనకు ఈ ప్రత్యేకత దక్కింది. రిలయన్స్ జియో, రిలయన్స్ రిటైల్‌లలోకి భారీగా పెట్టుబడులు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో... రిలయన్స్ విలువ భారీగా పెరిగింది. ఆగస్ట్ 31 తో ముగిసిన పన్నెండు నెలల కాలంలో ముఖేష్ అంబానీ సంపద 73 శాతం పెరిగింది. దీంతో ఆయన సంపద రూ. 6.58 లక్షల కోట్లకు చేరుకుంది. ఈ జాబితాలో రూ. వెయ్యి కోట్లకు మించి సంపద ఉన్న 828 మందిని పరిశీలించారు. వీరిలో 627 మంది సంపద పెరగగా, మరో 229 మంది సంపద మాత్రం తగ్గింది. కాగా... గతంలో ఈ జాబితాలో చోటు దక్కించుకున్న 75 మంది ఈసారి చోటు దక్కించుకోలేకపోయారు. ఈ జాబితాలో కొత్తగా 162 మంది చోటు దక్కించుకున్నారు.

# వినూత్న నిరసన దీక్షలు

**విశాఖపట్నం, దక్షిణం, వార్తావళి, సెప్టెంబర్ 30:** బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతాంగ చట్టాన్ని నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వ ర్యంలో రెండోవరోజు బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రైతులు మెడకు ఉరితా డు తగిలించుకుని విన్నూత్నంగా నిరసన దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ నరసింగరావు మాట్లాడుతూ బీజేపీ అధికారం లోకి రావడానికి నాడు చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోలేక పోగా ధరలు మరింత పెంచారు. ఢిల్లీలో, తమిళ రైతుల ఆందోళ నలు, వందలాది కిలోమీటర్లు కాలినడకన నాసిక్ నుండి ముంబయి చేరుకున్న వేలాది మహారాష్ట్ర రైతులు, ఢిల్లీ చుట్టుపక్కల ఏడు రాష్ట్రాలకు చెందిన 103 సంఘాల రైతులు ఢిల్లీ ముట్టడి రైతుల దుస్థితికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో వైస్సార్ ప్రభుత్వం 15 మాసాల కాలంలోనే 1.25 లక్షల కోట్లు అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టిందని విమర్శించించారు. మోడీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి రాష్ట్రాలకు గల అధికారాలకు కత్తెర వేసి నియంత్రణ ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. వ్యవసాయం, సహకారం వంటి రంగాలు పూర్తిగా రాష్ట్రాల జాబితాలో ని అంశాలని కానీ నేడు రాష్ట్రాల ప్రాముఖ్యత కాదని రైతులను, వ్యాపారవర్గాల వారిని బానిసలుగా చేసి 3 వ్యవసాయ బిల్లులు పార్లమెంటులో ఆమోదించారంటే రైతాంగం పట్లా ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది అన్నారు. ఈ నిరసన దీక్షలలో సీపీఐ నగర కార్యదర్శి, సీపీఎం విశాఖ నగర కార్యదర్శి ఎం పైడిరాజు సీపీఎం నగర కార్యదరివర్గ సభ్యుడు ఆర్ కె ఎస్ వి కుమార్, సీపీఐ ఎం ఎల్ ఎన్ డి జిల్లా నాయకులు వై. కొండయ్య, సీపీఐ ఎం ఎల్ నాయకులు గణేష్ పాండా, వామపక్షాలు నాయకులు ఎం.మన్మద రావు, నాయనబాబు, నందన్న,శేఖర్,టి వి రావు,నల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## ఈ 'సర్కార్‌రాజ్'లో పనిచేయలేం!



**న్యూఢిల్లీ,** అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థ 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' భారత్‌లో తమ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్టు మంగళవారం సంచలన ప్రకటన చేసింది. కేంద్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా తమ బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. అవాస్తవాలు, ఉద్దేశపూర్వక ఆరోపణలతో మానవ హక్కుల సంస్థలను కేంద్రప్రభుత్వం ఓ మంత్రగత్తెలా వెంటాడుతున్నదని తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనను విడుదల చేసింది. 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఇండియాకు సంబంధించిన భారత్‌లోని అన్ని బ్యాంకు ఖాతాలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసినట్టు ఈనెల 10న మాకు తెలిసింది. దీంతో దేశంలో సంస్థ నిర్వహిస్తున్న అన్ని కార్యకలాపాలను నిలిపివేస్తున్నాం' అని వెల్లడించింది. ప్రభుత్వ నిబంధనలకు, అంతర్జాతీయ నియమాలకు లోబడే అన్ని కార్యకలాపాలు, లావాదేవీలను నిర్వహిస్తున్నట్టు ఆమ్నెస్టీ పేర్కొంది. ఆరోపణలు వాస్తవదూరం ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటనపై కేంద్ర హోంశాఖ ఖండించింది. కేంద్ర ప్రభుత్వం మంత్రగత్తెలా వెంటాడుతున్నట్టు పేర్కొనడం దురదృష్టకరమని పేర్కొంది.

## వైసీపీ ఎమ్మెల్యే కారుకి ఘోర ప్రమాదం !



**నెల్లూరు, వార్తావళి, సెప్టెంబర్ 30 :** నెల్లూరు జిల్లా వైసీపీ ఎమ్మెల్యే కారుకు రోడ్డు ప్రమాదం జరిగింది. తెట్టు జంక్షన్ దగ్గర నెల్లూరు రూరల్ వైసీపీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కారు మరో వాహనాన్ని ఢీకొట్టినట్లు సమాచారం. ఈ రోడ్డు ప్రమాదంలో కారు ముందు బాగం పూర్తిగా నుజ్జు నుజ్జు అయిపోయినట్టు తెలుస్తుంది. అయితే ఆ సమయంలో ఎమ్మెల్యే ఆ కారులో లేరు. దీనితో ఎమ్మెల్యేకి పెను ప్రమాదం తప్పింది. ఆ ప్రమాదం జరిగిన సమయంలో ఆ కారులో కేవలం డ్రైవర్ మాత్రమే ఉన్నట్టు తెలుస్తుంది. దీనితో డ్రైవర్ ఎలాంటి గాయాలు కాకుండా తప్పించుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదం గురించి తెలిసిన వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోలీసులు ఘటన పై ఆరా తీశారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి ఆరోగ్య బాగాలేకపోవడంతో ఇంట్లోనే ఉన్నట్లు తెలుస్తోంది. ఓ పనిమీద ఎమ్మెల్యే కారు డ్రైవర్ విజయవాడ వెళుతుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదం గురించి ఎమ్మెల్యే కూడా ఆరా తీసినట్లు తెలుస్తోంది. ప్రమాదంతో రోడ్డుపై కొద్దిసేపు ట్రాఫిక్కు అంతరాయం కలిగింది. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## అమేజాన్, ఫ్లిఫ్‌కార్ట్‌లో 3లక్షల పోస్టులు

దసరా, దీపావళి సీజన్ వచ్చేసింది. ఈ-కామర్స్ సైట్లలో ఫెస్టివల్ సేల్ కూడా మొదలైంది. అక్టోబర్, నవంబర్ నెలల్లో వరుసగా సేల్స్ వుంటాయి. అమేజాన్, ఫ్లిప్‌కార్ట్, మింత్రా, ఆజియో, పేటీఎం మాల్... ఇలా ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ అన్నీ భారీ డిస్కౌంట్లు ప్రకటిస్తాయి. ఆఫర్స్ ఉన్నప్పుడు కొనేందుకు కస్టమర్లు ఎక్కువగా ఆసక్తి చూపిస్తుంటారు. దీంతో ఆర్డర్స్ ఎక్కువ ఉంటాయి. ఫలితంగా పార్శిల్ డెలివరీస్ పెరుగుతాయి. అందుకే ఫెస్టివల్ సేల్ కోసం అమేజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి సంస్థలు తాత్కాలికంగా ఉద్యోగులను నియమించుకుంటాయి. వీటితో పాటు ఇకామర్స్ ఎక్స్‌ప్రెస్ లాంటి థర్డ్ పార్టీ లాజిస్టిక్స్ సంస్థలు కూడా డెలివరీలు వేగంగా చేసేందుకు సిబ్బందిని నియమించుకుంటాయి. ఈసారి కరోనా వైరస్ సంక్షోభంతో ఎక్కువగా ఆన్‌లైన్ షాపింగ్ పైన ఆధారపడుతున్నారు కస్టమర్లు. ఫెస్టివల్ సేల్ జరిగే అక్టోబర్, నవంబర్ నెలల్లో రోజూ 2.2 కోట్ల షిప్‌మెంట్స్ ఉంటాయని కన్సల్టింగ్ సంస్థ రెడ్‌సీర్ అంచనా వేస్తోంది. గతేడాది ఫెస్టివ్ సీజన్‌లో రోజూ 1.2 కోట్ల షిప్‌మెంట్స్ డెలివరీ అయ్యేవి. ఈసారి మరో కోటి షిప్‌మెంట్స్ అదనంగా డెలివరీ అయ్యే అవకాశముంది. ఇంత భారీ స్థాయిలో వ్యాపారం జరుగుతుంది కాబట్టి ఈసారి 3,00,000 ఉద్యోగాలు కొత్తగా వస్తాయని కన్సల్టింగ్ సంస్థ రెడ్‌సీర్ అంచనా. వీటిలో 70 శాతం ఉద్యోగాలు అమేజాన్, ఫ్లిప్‌కార్ట్ కల్పించనున్నాయి. ఈ డిమాండ్‌ను ముందే అంచనా వేస్తున్న ఇ-కామర్స్ సంస్థలు సప్లై చెయిన్, లాజిస్టిక్స్‌పై ఎక్కువగా దృష్టి పెట్టాయి. ఇప్పటికే ఫ్లిప్‌కార్ట్ 70,000 ఉద్యోగాలను ప్రకటించింది. ఈసారి ఫెస్టివల్ సీజన్‌లో జరిగే బిగ్ బిలియన్ డేస్ సేల్ కోసం 70,000 ప్రత్యక్ష ఉద్యోగాలను కల్పిస్తోంది. ఫ్లిప్‌కార్ట్ సప్లై చెయిన్‌లో ఎగ్జిక్యూటీవ్స్, పిక్కర్స్, ప్యాకర్స్, సార్టర్స్ లాంటి 70,000 పోస్టుల్ని భర్తీ చేస్తోంది. వీటితో పాటు పరోక్షంగా లక్షలాది ఉద్యోగాలు లభించనున్నాయి. మరోవైపు అమేజాన్ కూడా కొత్తగా 200 డెలివరీ స్టేషన్స్ ఏర్పాటు చేసింది.

# జనసేన నాయకులు వార్డు పర్యటన

**మల్కాపురం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** మల్కాపురం, పారిశ్రామిక ప్రాంతం పశ్చిమ నియో జకవర్గం జివిఎంసి 61 వ వార్డు జనసేన కార్పొరేటర్ అభ్యర్థి నొల్ల రామ చంద్రకళ, దుంగ దేవన్ రాజు (సీనియర్ నాయకులు పశ్చిమ నియోజ కవర్గం) ఆధ్వర్యంలో బుధవారం వార్డులో పర్యటన చేశా రు. ముఖ్యంగా గత మూడు రోజుల నుండి వెంకన్నపాలెం, రామ కృష్ణాపురం, ప్రాంతాలు ప్రజలు మున్సిపాలిటీ కుళాయిలు నుండి వస్తున్న మంచినీటిలో ఎర్రమట్టి ,నల్లగా రావడం, కిరోసిన్ వివిధ ఆ యిలు వాసనతో నీళ్ల రావడం జరుగుతుందని స్థానికులు తెలి పారు, అదేవిధంగా నీరు ఇచ్చే సమయం చాలా తక్కువగా ఉంది అని తెలిపారు ,దీనిపై స్పందించి చంద్రకళ సంతకాలు సేకరణ చేసి సంబంధిత అధికారులకు తెలియజేయడం జరుగుతుందని ఆమె తెలిపారు ,అదేవిధంగా ప్రస్తుతం అపరిశుభ్రగా వస్తున్న నీటిని వేడి చేసి త్రాగాలిఅని అని ఆమె సూచించారు, లేనియెడల అనారోగ్యా లకు గురి అవుతారని స్థానికులకు తెలిపారు ఈరోజు ఉదయం నీటి సరఫరా అధికారి వారికి ఫిర్యాదు అందజేశారు, తక్షణమే సంబంధిత అధికారులు వీటిపై చర్యలు తీసుకొని పరిశుభ్రమైన నీటిని అందించాల్సిం దిగా కోరారు, ఈ పర్యటనలో శ్రీకాంత్ ,జె సి ఎఫ్ సభ్యులు, జనసైనికులు ,వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గంటల్లోనే బియ్యం కార్డు పంపిణీ

### ఎమ్మెల్యే అమర్నాథ్‌కు ప్రశంసలు

**కశింకోట, వార్తావళి, సెప్టెంబర్ 30 :** కశింకోట- అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కులమతాలకు, రాజకీయా లకు అతీతంగా అందిస్తామని నియోజకవర్గంలో ఎక్కడ సమావేశాలు జరిగిన చెబుతువుండే స్థానిక ఎమ్మెల్యే గుడివాడ ఆమర్నాథ్ ఆదేశాలు గ్రామ సచివాలయాలు ద్వారా ప్రజలకు సేవలు అందుతున్నాయి. ఇప్పటికే చాలామంది ప్రభుత్వ సంక్షేమ పథకాలను సచివాలయం ద్వారా పొందుతున్నారు. అందులో భాగంగా మండలంలోని కొత్తపల్లి గ్రామ సచివాల యంలో మొగిలి అప్పలనర్స బియ్యం కార్డు కు దరఖాస్తు చేసుకున్న ఆరు గంటలలోనే రెవిన్యూ అధికారులు పరిశీలించి బియ్యం కార్డు మం జూరు చేయించి ఆ మహిళకు సచివాల యం విఆర్వో నాయుడు బాబు అందచేసారు. అయితే ఆ మహిళా ఆశ్చర్యానికి గురైనది. దర ఖాస్తు చేసుకున్న ఆరు గంటలలోనే నాకు బియ్యం కార్డు రావడం సంతోషంగా ఉందని ఆమే సంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే ఆమర్నాథ్‌లను మీడియా ద్వారా ఆమె కృతజ్ఞతలు తెలిపింది. సచివాలయం వేగంగా సేవలు అందిస్తున్న విఆర్వో, వలేంటర్లును కొత్తపల్లి వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

## అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం



**భీమునిపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** జీవీఎంసీ పనులు వేగవంతం చేయాలని పర్యాటక శాఖ మంత్రి ముత్తెంశెట్టి శ్రీనివాసరావు (అవంతి) అధికారులను ఆదేశించారు. మంగళవారం భీమిలి క్యాంపు కార్యా లయం నందు ఆయన అధికారులతో, వైకాపా నాయకులు తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా జివిఎంసి వార్డులలో సమస్యలు గురించి అధికారులను, నాయకు లను అడిగి తెలుసుకున్న ఆయన సమస్యలను వెంటనే పరిష్కరిం చాలని అన్నారు. అంతేకాకుండా స్థానిక చిన్న బజార్ వద్ద ఉన్న ఆర్. టి.సి కాంప్లెక్స్ పునఃప్రారంభనకు అధికారులకు సూచనలు ఇచ్చారు. అదే విధంగా బీచ్ రోడ్డు విస్తరణ లో భాగంగా ఆర్.కె బీచ్ తరహాలో భీమిలి బీచ్ పార్క్ నుండి భీమిలి బీచ్ రోడ్డు బీసీ హాస్టల్ వరకు పర్యటకంగా అభివృద్ధి చెయ్యాలని అధికారులకు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాల సందర్శన

**భీమునిపట్నం, వార్తావళి, సెప్టెంబర్ 30 :** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆంధ్రప్రదేశ్ బోర్డు ఆఫ్ ఇంటర్మీడి యట్ ఎడ్యుకేషన్, రీజి నల్ జాయింట్ డైరెక్టర్ టి. వెంకటేశ్వరరావుసందర్శించారు. కళాశాల లోని రికార్డులు ను తరగతి గదులు ను మరియు లాబ్ ల ను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్టణం జిల్లా డి.వి. ఇ. ఓ పి.సోమరాజు, కళాశాల ప్రిన్సిపాల్ పి.ఉమారాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మలబార్‌లో ఆభరణాల ప్రదర్శన ప్రారంభం

**పెదవాల్తేరు, వార్తావళి, సెప్టెంబర్ 30 :** నగరంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంలో అద్వితీయమైన బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శన ప్రారంభించినట్లు షోరూం అధినేత తాసిల్ తెలిపారు. ఈ ప్రదర్శనలో బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాభారణాలు, కళానైపుణ్యత కలిగిన ఆభరణాలు ఉంటాయన్నారు. బంగారం, అంకట్, డైమండ్స్, పచ్చలు, కెంపులు మొదలగు ఆభరణాలు ఉన్నాయన్నారు. వీటన్నిటి తరుగు ఛార్జీలపై 30శాతం వరకు తగ్గింపు, వజ్రాభరణాలపై 20శాతం తగ్గింపు ఉంటుందన్నారు. మైన్, ప్రెస్యా, ఎత్నిక్స్, డివైన్, చిన్నపిల్లలకు ప్రత్యేకంగా ప్లార్లెట్ తదితర బ్రాండ్లు ప్రదర్శనలో ఉంటాయన్నారు. ఈ ప్రదర్శన అక్టోబర్ 11వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

Printed, Published and Owned by B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh.
Editor B.V.Subrahmanyam, RK Printers, 49-23-27-1 Lalitha Nagar, Flot No: 101, Sai Tirumala Enclave, Visakhapatnam - 530016 Andhra Pradesh. Email : bulusu009@gmail.com, Cell : 8500159006